మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 30-6-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 1 Issue: 1

30 జూన్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం%ఐఱఅఒఐ ఘ్రీశ్రీఐఱఖుఈ %ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:49 సూర్యాస్తమయం - సా. 6:50 తిథిః పంచమి ఉ. 9:27 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం మఖ ఉ. 7:18 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం సిద్ధి సా. 5:19 వరకు కరణం భాలవ ఉ. 9:27 వరకు కౌలవ రా. 9:51 వరకు వర్జ్యం మ. 3:51 నుండి సా. 5:33 వరకు దుర్ముహూర్తం మ. 12:45 నుండి మ. 1:37 వరకు మ. 3:22 నుండి సా. 4:14 వరకు రాహుకాలం ఉ. 7:26 నుండి ఉ. 9:04 వరకు యమగండం ఉ. 10:42 నుండి మ. 12:19 వరకు గుళికాకాలం మ. 1:57 నుండి మ. 3:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:13 నుండి తె. 5:01 వరకు అమృత ఘడియలు తె. 4:51 నుండి ఉ. 6:30 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:45 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From Jagitial
www.evarthalu.com





# అన్నదాతకు బండారు బోర్డు

పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు

## నిజామాబాద్‌లో పసుసు బోర్డు ప్రధాన కార్యాలయం ప్రారంభం

## రైతుల హామీ నెరవేర్చాం.. అర్వింద్ అనుకున్నది సాధించారు

**ఇక్కడి పసుపు భవిష్యత్తులో ప్రపంచమంతా ఎగుమతి**

**తక్షణమే నక్సలైట్లు హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలి**

**భారత్ శక్తిని ఆపరేషన్ సింధూర్‌తో ప్రపంచానికి చూపాం**

**నిజామాబాద్ రైతు సమ్మేళన సభలో కేంద్ర మంత్రి అమిత్ షా**

40 ఏళ్ల కల.. హామీ ఇవ్వని పార్టీ లేదు.. ఆశ చూపని ప్రభుత్వం లేదు.. ఇంకెప్పుడా! అని ఎదురుచూస్తున్న నిజామాబాద్ రైతుల కల ఎట్టకేలకు ఆదివారం తీరింది. నిజామాబాద్‌లో పసుపు బోర్డు జాతీయ కార్యాలయం ఏర్పాటైంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ప్రారంభమైంది. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయించి తీరుతానని హామీ ఇచ్చిన ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆ హామీని నెరవేర్చి చూపారు. ఈ సందర్భంగా స్థానిక పాలిటెక్నిక్ మైదానంలో బీజేపీ రైతు సమ్మేళన సభ ఏర్పాటు చేసింది. ఆ సభలో పాల్గొని ప్రసంగించిన అమిత్ షా.. 'ఇచ్చిన హామీ ప్రకారం అర్వింద్ నిజామాబాద్‌కు పసుపుబోర్డు సాధించారు.

నిజామాబాద్, జూన్ 9 (ఈవార్తలు): పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నాం. నిజామాబాద్ రైతులు పసుపుబోర్డు కోసం 40 ఏళ్ల పాటు పోరాటం చేశారు. నిజామాబాద్ రైతులు పండించిన పసుపు భవిష్యత్తులో ప్రపంచమంతా ఎగుమతి అవుతుంది. పసుపుబోర్డు కార్యాలయం ఏర్పాటుతో స్థానిక రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. భారత్ ఆర్గానిక్ లిమిటెడ్, భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్ కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటు అవుతున్నాయి. భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్‌తో నిజామాబాద్ పసుపు అమెరికా, యూరప్‌కు ఎగుమతి అవుతుంది.

### తెలంగాణలో అధికారంలోకి వస్తాం

తెలంగాణలో బీజేపీ తప్పక అధికారంలోకి వస్తుందని, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే బీజేపీ విజయం ఖాయమైందని తెలుస్తోందని అమిత్ షా అన్నారు. ధరణి పోర్టల్, కాళేశ్వరం.. ఇలా అనేక అంశాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఢిల్లీకి ఏటీఎంగా మార్చేసిందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పోయింది.. కానీ అవినీతి పోలేదని అన్నారు. ఇక.. నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని హెచ్చరించారు. 'పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్థాన్ భారత్‌ను భయపెట్టాలని చూసింది. కానీ భారత్ శక్తి తరువాయి 2 వ పేజీలో...



# అమ్మవారికి.. బంగారు బోనం

## గోల్కొండ కోటలో జగదాంబికకు బోనాలు సమర్పణ

**ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తుల మొక్కులు**

**సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఘటోత్సవాలు ప్రారంభం**

**విజయవాడలో దుర్గమ్మకు అందిన తెలంగాణ బోనం**

తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. ఆషాఢ మాస బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో భక్తులు పెద్ద ఎత్తున శ్రీ జగదాంబిక అమ్మవారికి బోనాలు సమర్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు గోల్కొండకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో గోల్కొండ కోట పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పోతురాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో గోల్కొండలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులు వస్తారన్న ముందస్తు సమాచారంతో ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కాగా, ఈ నెల 26 నుంచి ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు మొదలయ్యాయి.



హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి తొలిబోనం సమర్పించడంతో జాతర మొదలైంది. ప్రతి గురు, ఆదివారాల్లో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించనున్నారు. అమ్మవార్లకు 9 పూజలతో గోల్కొండ బోనాలు జరుగుతాయి. గోల్కొండ కోటలో నెల రోజుల పాటు బోనాలు జరగుతాయి. జులై 24న తిరిగి గోల్కొండ కోటలోనే వేడుకలు ముగుస్తాయి.సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఎదుర్కోలుతో తరువాయి 2 వ పేజీలో...

## 477 డ్రోన్లు.. 60 క్షిపణులు

ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి

దీటుగా ఎదుర్కొన్నామన్న ఉక్రెయిన్

5

## విశ్వవాణి



జపాన్‌లో గత 50 ఏళ్లలో బుల్లెట్ రైళ్లు వెయ్యి కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినా ఒక్క ప్రమాదం జరగలేదు. ఒక్క మరణమూ చోటుచేసుకోలేదు. భూకంపాల లాంటి ప్రకృతి విపత్తులు సంభవించినా రైలు ప్రమాదాల్లో ఒక్కరూ చనిపోలేదు.



## వైద్య విద్యార్థులకు 15% స్టైపెండ్ పెంపు


**సమ్మె విరమిస్తూ జూనియర్ వైద్యుల ప్రకటన**

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): వైద్య విద్యార్థులకు 15 శాతం స్టైపెండ్ పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెడికల్, డెంటల్ విద్యార్థులకు ఈ పెంపు వర్తించనుంది. సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల గౌరవ వేతనాన్ని కూడా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజా పెంపుతో ఇంటర్న్‌లకు నెలకు రూ.29,792 స్టైపెండ్ లభించనుంది. పీజీ డాక్టర్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.67,032, సెకండ్ ఇయర్‌లో రూ.70,757, ఫైనల్ ఇయర్‌లో రూ.74,782 గౌరవ వేతనం తరువాయి 2 వ పేజీలో...

## శ్రీవారి భక్తులకు బీమా!

2

సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న టీటీడీ




5

## బిగ్ బ్యూటిఫుల్ బిల్లుతో ఉద్యోగాలు నాశనం

ట్రంప్ నిర్ణయంపై మస్క్ మరోసారి విమర్శలు

బిల్లుకు సెనేట్ ఆమోదం.. ట్రంప్ హర్షం




## ఉచిత ల్యాప్‌టాప్ అంతా మోసం: కేంద్రం

దేశంలో విద్యార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు వస్తున్న వాట్సాప్ మెసేజ్‌లపై కేంద్రం అప్రమత్తమైంది. ప్రభుత్వం ఎలాంటి ఉచిత ల్యాప్‌టాప్‌లూ ఇవ్వడంలేదని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. 'కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను తరువాయి 2 వ పేజీలో...



## భళా.. భద్రాద్రి గిరిజన మహిళల్లారా!

**మీ విజయం దేశంలో ఎంతోమందికి స్ఫూర్తి**

**చిరుధాన్యాల బిస్కెట్లు విదేశాలకు ఎగుమతి**

**తెలంగాణలో దివ్యాంగులతో యోగా ఆకట్టుకుంది**

**ఈసారి యోగా వసుధైక కుటుంబానికి స్ఫూర్తి**

**భారత్ ట్రకోమా రహిత దేశంగా రూపాంతరం**

**123వ మన్ కీ బాత్‌తో ప్రధాని మోదీ వెల్లడి**

ఒకప్పుడు కూలీ పని చేసుకొని బతికిన భద్రాచలం గిరిజన ఆడబిడ్డలు నేడు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆదివారం ఆయన 123వ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా.. తెలంగాణ ఆడబిడ్డల కృషిని ప్రస్తావించారు. వారి అభివృద్ధిని అభినందించారు.

న్యూఢిల్లీ, ఈవార్తలు: 'భద్రాచలంలో గిరిజన ఆడబిడ్డలు స్వయం సహాయక బృందంగా ఏర్పడి, చిరుధాన్యాలతో బిస్కెట్లు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. శానిటరీ పాడ్స్ కూడా తయారు చేసి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వీరి విజయం దేశంలో ఎంతోమందికి స్ఫూర్తిదాయకం' అని అన్నారు. ఈ నెల 21న జరిగిన అంతర్జాతీయ యోగా విశేషాలను కూడా ప్రధాని మన్ కీ బాత్‌లో పంచుకున్నారు. ఈసారి ప్రపంచంలో చాలా ప్రదేశాల్లో యోగా ప్రదర్శనలు తరువాయి 2 వ పేజీలో...

# బీజేపీ అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్

**నేడు నామినేషన్ల స్వీకరణ.. రేపు ఎన్నిక**

**రేసులో లక్ష్మణ్, ఈటల, అర్వింద్, బండి**

**మహిళా కోటాలో డీకే అరుణ ఆశాభావం**

**బీసీ నేతకే అవకాశాలు అని జోరుగా ప్రచారం**



హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికకు ఆ పార్టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం నామినేషన్లు స్వీకరించనుండగా, మంగళశారం ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో పలువురు సీనియర్లు అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కేంద్ర మంత్రి బండి సంజయ్ అధ్యక్ష పదవి పోటీలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మహిళా కోటాలో డీకే అరుణ పదవిని తరువాయి 2 వ పేజీలో...



# అన్నదాతకు బండారు బోర్డు

మొదటి పేజీ తరువాయి

ఏమిటో పాకిస్థాన్‌కు, ప్రపంచానికి తెలిసింది. ఉగ్రవాదాన్నే కాదు.. దేశంలో నక్సలిజం కూడా లేకుండా చేయాలన్నదే మోదీ లక్ష్యం. 2026 మార్చి 30 లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తాం. నక్సలైట్లు త్వరగా జనజీవన స్రవంతిలోకి రావాలి. ఇప్పటికే 10వేల మంది నక్సలైట్లు లొంగిపోయారు' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అర్వింద్, లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నిజామాబాద్ ప్రాంత రైతులకు పసుపు బోర్డు బహుమతి అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రైతుల దశాబ్దాల కలను కేంద్రం నెరవేర్చిందని చెప్పారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ పసుపు సాగవుతున్నా.. ఈ ప్రాంతంపై ప్రేమతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా నిజామాబాద్‌లో పసుపుబోర్డు కేంద్ర కార్యాలయం ఏర్పాటు చేశారని వెల్లడించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతులకు కేంద్రం అండగా ఉంటుందని, ఎరువులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుందని వివరించారు. రైతుల కోసమే రామగుండంలో ఎరువుల ఫ్యాక్టరీని ప్రారంభించిందని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'పసుపు బోర్డు కోసం ఇందూరు రైతులు



గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఢిల్లీలో పసుపు అర్వింద్ అంటున్నారు. ప్రధానమంత్రి మోదీ, అమిత్‌షా ఆదేశాలతో నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేశారు. దీంతో పాటు జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నిజామాబాద్ వ్యక్తినే నియమించారు. రైతును రాజు చేయాలనేది గత నినాదం. రైతును రారాజు చేయాలనేది మోదీ నినాదం. రైతులంతా మోదీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అండగా నిలవాలి. తెలంగాణలో అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారు. బీజేపీకి ఒక్కసారి అవకాశమివ్వండి' అని విజ్ఞప్తి చేశారు.

### డీఎస్ విగ్రహావిష్కరణ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి డీ శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్తా, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, డీఎస్ సోదరుడు సురేందర్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశవేణు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి.. బంగారు బోనం

మొదటి పేజీ తరువాయి

ఘటాన్ని ఆలయానికి తీసుకొచ్చారు. అమ్మవారి బోనాల జాతరకు 15 రోజుల ముందు (ఘటోత్సవం) ఘటాల ఎదుర్కోలు నిర్వహించడం ఆనవాయితీ. ఘటాల ఎదుర్కోలుతోనే బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లుగా భావిస్తారు. ఘటాలకు సంబంధించిన సామగ్రిని కర్బలా మైదానం ప్రాంతంలోని అమ్మవారి దేవాలయానికి తీసుకువెళ్లి ఘటాన్ని ముస్తాబు చేస్తారు. ఈ ఘటాన్ని సోమవారం నుంచి జూలై 11 వరకు ఆయా ప్రాంతాల్లో దర్శనం ఇచ్చి, 12న దేవాలయానికి తీసుకువస్తారు. 13న బోనం, 14న రంగం, భవిష్యవాణి అనంతరం అంబారీ ఊరేగింపు ఉంటుంది. అనంతరం ఘటాన్ని మెట్టుగూడలోని అమ్మవారి ఆలయానికి సాగనంపుతారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే నెల 13న రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు చేస్తారని వారు తెలిపారు. 14న ఉదయం 8.30 గంటలకు భవిష్యవాణి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో తెలంగాణ బోనాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

## వైద్య విద్యార్థులకు 15% స్టైపెండ్ పెంపు

మొదటి పేజీ తరువాయి

అందనుంది. ప్రభుత్వం స్టైపెండ్ పెంచడంతో సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు జూనియర్ డాక్టర్లు వెల్లడించారు. స్టైపెండ్ పెంపుతో పాటు, అన్ని వైద్య కాలేజీల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రస్తుతం నెలకొన్న ఫ్యాకల్టీ కొరత, ఇతర సమస్యలకు గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా ఇబ్బడిముబ్బడిగా కాలేజీలు ప్రారంభించడమే కారణమని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం ఫ్యాకల్టీ, మౌలిక వసతులు, బిల్డింగులు లేకుండానే గోదాముల్లో కాలేజీలు ప్రారంభించిందని ఆరోపించారు. దాంతో ఇప్పుడు తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో భేటీ అనంతరం జూనియర్ డాక్టర్లు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఉచిత ల్యాప్‌టాప్ అంతా మోసం: కేంద్రం

మొదటి పేజీ తరువాయి

అందించడం ద్వారా విద్యలో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహిస్తోంది. అందువల్ల మీరు కేంద్ర ప్రభుత్వ ఉచిత ల్యాప్‌టాప్ పథకం కింద ఉచిత ల్యాప్‌టాప్ కావాలనుకుంటే అధికారిక సైట్‌ను సందర్శించి మీ అర్హతను చెక్ చేసుకోచ్చు' అని పేర్కొంటూ సైబర్ కేటుగాళ్లు పంపిన మెసేజ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం కోరింది. ఈ సందేశం నకిలీదని, మోసపూరితమైనదని తెలిపింది. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయొద్దని సూచించింది. అధికారిక వర్గాల ద్వారా సమాచారాన్ని వెరిఫై చేసుకోవాలని తెలిపింది.

## శ్రీవారి భక్తులకు బీమా! సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న టీటీడీ

తిరుమల, జూన్ 29 (ఈవార్తలు): తిరుమలకు వచ్చే భక్తులందరికీ భవిష్యత్తులో బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ యోచిస్తున్నట్లు సమాచారం. శ్రీవారి దర్శనార్థం రోజూ సుమారు 70 వేలు నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తుంటారు. 2 ఘాట్‌రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గం, క్యూలైన్లు తదితర ప్రదేశాల్లో అప్పుడప్పుడు ప్రమాదాలకు గురికావడం, ఆకస్మికంగా అనారోగ్యం బారిన పడటం, నడక మార్గంలో అడవి జంతువుల దాడి లాంటి ఘటనల నేపథ్యంలో భక్తులకు బీమా కల్పించాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో ప్రమాదానికి గురై చనిపోతే టీటీడీ రూ.3 లక్షల వరకు చెల్లిస్తోంది. ఇప్పుడు అలిపిరి నుంచి తిరుమలకు, తిరుమల నుంచి అలిపిరి వరకు భక్తులు చేరుకునేవరకు బీమాను కల్పించాలని చూస్తోంది. భక్తులకు బీమా కల్పించే సంస్థలు, వసూలు చేసే ప్రీమియం, దాతల సహకారం తదితర అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

## రాశి ఫలాలు

మేషం: చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. స్థిరాస్తి ఒప్పందాలలో పునరాలోచన చేయడం మంచిది. సన్నిహితులతో కీలక విషయాలను చర్చిస్తారు. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మనస్పర్ధలు ఉంటాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది.

వృషభం: అనుకున్న పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. సోదరులతో వివాదాలను తెలివిగా పరిష్కరించుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

మిధునం: వృత్తి వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. గృహమున విలువైన పత్రాలు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలలో విజయం సాధిస్తారు.

కర్కాటకం: చిన్ననాటి మిత్రులతో విలువైన సమయాన్ని గడుపుతారు. వృత్తి ఉద్యోగాల్లో అధికారులతో మాట పట్టింపులు ఉంటాయి. కుటుంబ పెద్దలతో చిన్నపాటి వివివాదాలు ఉంటాయి. చేపట్టిన పనులలో నూతన ప్రణాళికలు అమలుపరచి సకాలంలో పూర్తిచేస్తారు. వ్యాపారాలలో స్వల్ప లాభాలను అందుకుంటారు.

సింహం: చిన్ననాటి మిత్రులతో విలువైన సమయాన్ని గడుపుతారు. వృత్తి ఉద్యోగాల్లో అధికారులతో మాట పట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తిచేస్తారు. భూ సంబంధిత వ్యాపారస్తులకు కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కన్య: నూతన వ్యాపారాలు ప్రారంభించిన ఆశించిన లాభాలు అందుకుంటారు. అన్ని రంగాల వారికి అనుకూల ఫలితాలు ఉంటాయి. కుటుంబ వాతావరణం అనుకూలిస్తుంది. వృత్తి ఉద్యోగాల్లో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. దైవ సేవా కార్యాక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

తుల: వాహన సంభందమైన సమస్యలు కలుగుతాయి. స్థిరాస్తి కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. కుటుంబమున మీ ఆలోచనలు ఎవ్వరికీ నచ్చవు. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలుంటాయి. వ్యాపారాలలో స్వంత ఆలోచనలు అమలు పరచడం మంచిది.

వృశ్చికం: శత్రువుల పై ఆధిక్యత సాధిస్తారు. రాబడి మార్గాలు సంతృప్తి కరంగా సాగుతాయి. సన్నిహితుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. కొన్ని వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. బంధువులతో స్వల్ప వివాదాలుంటాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు లభిస్తాయి.

ధనస్సు: బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా సానుకూల ఫలితాలుంటాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందుతుంది. గృహమున కొన్ని సంఘటనలు గందరగోళంగా ఉంటాయి. వ్యాపార ప్రారంభమునకు అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు.

మకరం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగమున అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. నిరుద్యోగులకు చాలాకాలంగా ఎదురుచూస్తున్న అవకాశములు అందుతాయి. దైవ సేవ కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు.

కుంభం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చేపట్టిన పనులను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయగలుగుతారు. అన్ని రంగాల వారికీ అనుకూల వాతావరణం ఉంటుంది. సన్నిహితుల నుండి అందిన ఒక వార్త ఉత్సాహం కలిగిస్తుంది. వ్యాపార వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున ఉన్నత పదవులు పొందుతారు.

మీనం: దీర్ఘకాలిక ఋణ భారం అధికమౌతుంది. బంధు మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమ మరింత అధికం అవుతుంది. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు అనుకూలించవు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

## బీజేపీ అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి

ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తమకూ అవకాశం ఇవ్వాలని రామచందర్ రావు, తల్లోజు ఆచారి అధిష్టానం వద్ద మొరపెట్టుకున్నట్లు సమాచారం. ప్రస్తుత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఇదివరకే తాను రేసులో ఉండటం లేదని ప్రకటించారు. అయితే, ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బీసీ నేత ఉండటం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. ఆ వర్గం నేతకే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఇచ్చేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయని ఆ పార్టీ వర్గాల్లో అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అంటే.. ఈటల, లక్ష్మణ్, అర్వింద్‌లో ఒకరికి చాన్స్ దక్కనుంది.

### ఏపీలోనూ నోటిఫికేషన్ జారీ

ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్ష ఎన్నికకు కూడా ఆ పార్టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యుడు పీవీ సత్యనారాయణ అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్‌ను ఆదివారం విడుదల చేశారు. దీంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు అయింది. సోమవారం మధ్యాహ్నం వరకు నామినేషన్ల స్వీకరణను చేపట్టనున్నారు. మంగళవారం అంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన చేస్తారు. ఈ ఎన్నికకు పరిశీలకుడిగా కర్ణాటక బీజేపీ నేత, ఎంపీ పీసీ మోహన్ వ్యవహరిస్తున్నారు. అటు.. ఏపీలోనూ రాష్ట్ర అధ్యక్ష పదవిలో పురందేశ్వరి కొనసాగేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. దీంతో అధ్యక్ష రేసులో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి.

## భళా.. భద్రాద్రి గిరిజన మహిళల్లారా!

మొదటి పేజీ తరువాయి

జరిగాయని ఆనందం వ్యక్తం చేశారు. వాటిలో తెలంగాణలో 3000 మంది దివ్యాంగులు యోగా క్యాంప్ నిర్వహించడం ఆకట్టుకుందని తెలిపారు. పదేళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేటా విస్తరిస్తోందని చెప్పారు. చాలామంది యోగాను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారని అన్నారు. ఈసారి యోగా దినోత్సవం థీమ్ వన్ ఎర్త్- వన్ హెల్త్ వసుధైవ కుటుంబకానికి స్ఫూర్తిగా నిలిచిందని వెల్లడించారు.



### భారత్ ట్రకోమా రహితం

భారత్‌ను ట్రకోమా రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన విషయాన్ని ప్రధాని మోదీ గుర్తుచేశారు. బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ అయిన ట్రకోమా రహిత దేశంగా అవతరించడంలో అందరి కృషి ఉందని కొనియాడారు. అనంతరం ఎమర్జెన్సీ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని గుర్తుచేస్తూ.. 50 ఏళ్ల క్రితం దేశంలో ఎమర్జెన్సీ విధించిన వాళ్లు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని కాంగ్రెస్‌ను ఉద్దేశించి విమర్శించారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారని అన్నారు. భారత ప్రజలు శక్తిమంతమైనవారు కావడంతో ఎమర్జెన్సీ తొలగిపోయిందని, ఆ పరిస్థితి విధించినవాళ్లు ఓడిపోయారని గుర్తుచేశారు. ఎమర్జెన్సీపై పోరాడిన నేతలను దేశం కచ్చితంగా గుర్తుచేసుకోవాలని అన్నారు. బోడోల్యాండ్.. ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా మారిందని అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారని, దేశంలోని చిన్నారులకు ఆ ఆటగాళ్లు ఆదర్శం అని శ్లాఘించారు.

### నూనె వినియోగం 10 శాతం తగ్గాలి

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ ఆరోగ్య సూత్రాలు కూడా చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందని చెప్పారు. ఫిట్‌నెస్ కాపాడుకోవడానికి, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని సూచించారు. అదేవిధంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న భారత శాస్త్రవేత్త శుభాంశు శుక్లాకు ప్రధాని అభినందనలు తెలిపారు. మరోవైపు, మేఘాలయ ఎరీసిల్క్‌కు జీఐ ట్యాగ్ లభించిందని, పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దాని ప్రత్యేకత అని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో బౌద్ధ క్షేత్రాలకు విదేశాల్లో అత్యంత ప్రాధాన్యం ఉందని, అంతా తమతమ ప్రాంతాల్లోని బౌద్ధ క్షేత్రాలను సందర్శించాలని సూచించారు.

## విద్య, ఉద్యోగవాణి

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెకండరీ స్టీల్ టెక్నాలజీ
పోస్టు:
టెక్నికల్ మేనేజర్ (మెకానికల్)
అపాయింట్‌మెంట్:
కాంట్రాక్టు పద్ధతి
దరఖాస్తుకు చివరి తేది:
06.07.2025

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-వరంగల్
పోస్టు:
విజిటింగ్ కన్సల్టెంట్ (లీగల్ అడ్వైజర్)
అపాయింట్‌మెంట్:
కాంట్రాక్టు పద్ధతి
దరఖాస్తుకు చివరి తేది:
09.07.2025

ఫ్లుయిడ్ కంట్రోల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
పోస్టు: డైరెక్టర్
అపాయింట్‌మెంట్:
రిక్రూట్‌మెంట్
దరఖాస్తుకు చివరి తేది:
09.07.2025

జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ
పోస్టు: సీనియర్ కన్సల్టెంట్ (రికవరీ, రీకన్‌స్ట్రక్షన్)
అపాయింట్‌మెంట్:
కాంట్రాక్టు పద్ధతి
దరఖాస్తుకు చివరి తేది:
11.07.2025

# త్రిభాషపై మహారాష్ట్ర వెనక్కి

### త్రిభాష విధానం ఉత్తర్వులు ఉపసంహరణ.. ప్రకటించిన ఆ రాష్ట్ర సీఎం ఫడణవీస్

ముంబై: ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పిల్లలందరికీ హిందీ బోధించాలని ఆదేశాలు జారీ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం తాజా వెనక్కి తగ్గింది. ఈ నిర్ణయంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో వెనకడుగు వేసింది. త్రిభాషా విధానం ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఆ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానంపై ఎలా ముందుకెళ్లాలి? దాన్ని ఎలా అమలు చేయాలనే దానిపై విద్యావేత్త నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. 'ఒకటో తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి సంబంధించి ఏప్రిల్, జూన్‌లో జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానం అమలుపై సిఫార్సులు చేసేందుకు నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం' అని తెలిపారు.

### ఏమిటీ త్రిభాషా విధానం

జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లిష్, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. అయితే, ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే సర్కారు స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే.. ఇంగ్లిష్, మరాఠీ మీడియం పాఠశాలల్లో చదువుతున్న 1-5 తరగతుల విద్యార్థులకు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 16న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో హిందీని ఆప్షనల్‌గా మారుస్తూ సవరణ ఉత్తర్వు జారీ చేసింది. అయినా.. ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు కొనసాగాయి. ప్రభుత్వంపై పోరాడేందుకు శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ఏకం కానున్నారనే చర్చ మొదలైంది.

# కాంగ్రెస్ అవినీతిపై విచారణేది?

## కేంద్ర హెూంమంత్రిగా ఆదేశించడం లేదెందుకు?.. ఆర్ఆర్ ట్యాక్స్ అన్నారు.. దర్యాప్తు చేయలేదేం?

- కాంగ్రెస్ సీఎం అక్రమాలకు అడ్డుకట్ట వేయలేరా?
- బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక పావుగా రేవంత్
- అమిత్‌షాను నిలదీసిన కే తారకరామారావు

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): రేవంత్ సర్కారు.. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంలా మారిందని ఆరోపిస్తున్న కేంద్ర మంత్రి అమిత్ షా.. ఎందుకు విచారణకు ఆదేశించడం లేదు? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. సీబీఐ, ఈడీతో ఎందుకు దర్యాప్తు చేయించడం లేదని నిలదీశారు. విచారణ చేయించటానికి కేంద్రానికి ఏం అడ్డు వస్తున్నదని అడిగారు. నిజామాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి మూటలు పంపుతోందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై కేటీఆర్ అమిత్ షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీ కుస్తీ, తెలంగాణలో దోస్తీ అన్నట్టుగా సాగుతున్న కుమ్మక్కు రాజకీయాల వల్లే రేవంత్‌ను వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలకు సమాధానం ఉందా? బీఆర్ఎస్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక, రేవంత్‌ను బీజేపీ పావుగా వాడుకుంటున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రాహుల్-రేవంత్ ఆర్ఆర్ టాక్స్ పేరిట దోచుకుంటున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు.. కానీ, నేటికీ ఆదేశించలేదెందుకు? అని అడిగారు. సీఎంపై అవినీతి ఆరోపణలు చేస్తే సరిపోతుందా? పట్టపగలు ప్రజాధనం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు పంపుతున్న కాంగ్రెస్ సీఎం అక్రమాలకు కేంద్ర అడ్డుకట్ట వేయలేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న బీజేపీ ఈ రాష్ట్రంలో ఎప్పటికీ అధికారంలోకి రాదు.. రాబోదని జోస్యం చెప్పారు.

### కేటీఆర్ సంధించిన ప్రశ్నలివీ..

- పసుపు బోర్డుకు నయా పైసా కేటాయించకుండా రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి?
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పసుపు బోర్డు ఆఫీసును ప్రారంభించడం సమంజసమేనా?
- ఒక్క పసుపు బోర్డును ఇన్నిసార్లు ప్రారంభించడం సబబేనా?
- బనకచర్లకు బాటలు వేయడం తెలంగాణ హక్కులు కాలరాయడం కదా?
- బయ్యారం ఉక్కు కర్మాగారం, ఐటీఐఆర్ ప్రాజెక్టు రద్దు చేయడం తెలంగాణ ప్రజలకు చేసిన ద్రోహం కాదా?
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో వరంగల్ యువత ఉపాధికి భరోసా ఇవ్వగలరా?



## కాంగ్రెస్ నేత రావి శ్రీనివాస్ సస్పెన్షన్

### ఒరిగేదేం లేదు.. సీతక్క వల్లే వేటు: రావి

ఆసిఫాబాద్, జూన్ 29(ఈవార్తలు): కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీనివాస్‌ను ఆరేళ్లపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ప్రకటించింది. ఆయన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన టీపీసీసీ క్రమశిక్షణ చర్య కమిటీ (డీఏసీ) చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28 లోపు వివరణ ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని నోటీసులో పేర్కొన్నారు. అయితే, రావి శ్రీనివాస్ నుంచి సరైన వివరణ రాకపోవటంతో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు క్రమశిక్షణ కమిటీ పేర్కొంది. కాగా, తన సస్పెన్షన్‌పై రావి శ్రీనివాస్ స్పందించారు. సస్పెన్షన్‌తో తనకు ఒరిగేది ఏమీ లేదన్నారు. నిత్యం కార్యకర్తలను కాపాడుకుంటూ ప్రజల పక్షాన పోరాడే వ్యక్తిని అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుంచి తాను ఇచ్చే బహుమతిని స్వీకరించడానికి ఎదురు చూడాలని పార్టీకి సవాల్ విసిరారు. గత రెండు నెలల నుంచి తనను సస్పెండ్ చేయించాలని మంత్రి సీతక్క.. పీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ ఇన్చార్జిపై ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపించారు.

## రికవరీ ఏజెంట్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

వేములవాడ, జూన్ 29 (ఈవార్తలు): రికవరీ ఏజెంట్ వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకెళితే.. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన నాగుల వేణు (45) ఇంట్లో శనివారం రాత్రి ఉరివేసుకున్నాడు. ఒక ఫైనాన్స్ కంపెనీకి చెందిన రికవరీ ఏజెంట్ ఇంటికి వచ్చి అవమానించే విధంగా మాట్లాడడంతో మనస్థాపం చెంది, ఈ దారుణానికి ఒడిగట్టాడని స్థానికులు తెలిపారు. మృతుడు గతంలో గల్ఫ్‌కు వెళ్లొచ్చాడు. ఊర్లోనే ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని వెల్లదీస్తున్నాడు. అతడికి ముగ్గురు బిడ్డలు ఉన్నారని, కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నాడని తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. వేణు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామస్థులు కోరుతున్నారు.

## దమ్ముంటే కాపాడుకో

### ఎంపీ రఘునందన్‌కు మరోసారి బెదిరింపు కాల్స్



హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఆపరేషన్ కగార్ ఆపాలంటూ రెండు నంబర్ల నుంచి ఫోన్లు వచ్చాయి. ఏపీ మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు 5 బృందాలు రంగంలోకి దిగాయని.. ఆ టీమ్‌లు హైదరాబాద్‌లో ఉన్నాయని.. మరికాసేపట్లో చంపేస్తామని హెచ్చరించారు. దమ్ముంటే కాపాడుకోవాలని సవాల్ విసిరారు. మా ఫోన్లు ట్రేస్ చేసేందుకు యత్నిస్తున్నారని.. తమ సమాచారం దొరకదని అన్నారు. ఇంటర్నెట్ కాల్స్ వాడుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమన్నారు. కాగా, ఈ నెల 23న రఘునందన్‌కు తొలిసారి బెదిరింపు కాల్ వచ్చింది. బెదిరింపుల నేపథ్యంలో ఆయన డీజీపీ, మెదక్, సంగారెడ్డి ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. దీంతో రఘునందన్‌రావుకు ప్రభుత్వం ఎస్కార్ట్ వాహనం, అదనపు సిబ్బందితో రక్షణ కల్పించింది. అయితే, ఆదివారం మళ్లీ బెదిరింపు కాల్స్ రావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ట్యాపింగ్ ఘనత కాంగ్రెస్‌దే

### అనుంగు మీడియాతో తప్పుడు రాతలు.. దొంగ లీకులు.. వ్యక్తిగత దాడులు

### మహా న్యూస్ తెలంగాణ వ్యతిరేక సంస్థ.. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ అని బీఆర్ఎస్ సీనియర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ గురించి అడ్డగోలుగా మాట్లాడటం వింతగా ఉందని దుయ్యబట్టారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మాట్లాడిన ఆయన.. బీజేపీలో ఉంటూ కాంగ్రెస్‌కు వంత పాడే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎవరు పిలవకపోయినా.. తన ఫోన్ ట్యాప్ అయ్యిందని కామెడీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ చేసేది పోలీసులా? గాంధీ భవన్‌లో ఉండే కాంగ్రెస్ మంత్రులు, యూత్ కాంగ్రెస్ నాయకులా? ఏది వాస్తవమో.. ఏది అవాస్తవమో.. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతూ.. హెూం మంత్రిగా బాధ్యతగల పదవిలో ఉంటూ సీఎం రేవంత్ ఇస్తున్న ఆదేశాలతో వారి అనుంగు మీడియాతో తప్పుడు రాతలపై, పిచ్చి కూతలు, దొంగ లీకులతో వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. మహా టీవీతో పాటు మరికొన్ని వార్తా సంస్థలు, యూట్యూబ్ చానళ్లు అడ్డగోలుగా అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రేవంత్ ఆదేశాలతో తమ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్‌పై అక్రమ కేసులు పెట్టిన పోలీసులు.. కేసీఆర్, కేటీఆర్‌పై అడ్డగోలు, అశ్లీల, జుగుప్సాకరమైన వార్తలు రాసిన మహా న్యూస్‌పైనా సుమోటోగా కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా, రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. 80-90 కేసుల నేర చరిత్రతో పాటు ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా కెమెరాల ముందు దొరికిన ఒక దొంగ మాటలు విని హేయమైన పాత్ర పోషిస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వం కూడా సొంత మంత్రులు పొంగులేటి, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాపింగ్ చేస్తుండడం నిజం కాదా? అని ప్రశ్నించారు.



## కాంగ్రెస్‌లో కోవర్టులు

### డబ్బుకు అమ్ముడుపోయారు.. దొరికిన రోజు వదిలేదే లేదు..మైనంపల్లి హాట్ కామెంట్స్

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు ఉన్నారని ఆ పార్టీ నేత మైనంపల్లి హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. 'మా కాంగ్రెస్ పార్టీలోనే కోవర్టులు ఉన్నారు. వాళ్లు దొరికిన రోజు బట్టలిప్పి కొడతా. కొంత మంది డబ్బులకు అమ్ముడుపోయి కాంగ్రెస్ పార్టీని డ్యామేజ్ చేస్తున్నారు. అలాంటి వారిని వదిలి పెట్టేది లేదు. నేను రాజకీయాల్లో ఉన్నా, లేకపోయినా, అమ్ముడుపోయే నాయకులను మాత్రం వదిలి పెట్టేది లేదు' అని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంపై కూడా మైనంపల్లి స్పందించారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌తో సంసారాలు నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో పాటు భార్య, కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. భార్యాభర్తలు ఏకాంతంగా ఉన్నప్పుడు కూడా ఫోన్ ట్యాప్ చేశారని కూడా పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఫోన్ ట్యాపింగ్‌తో సినీ కుటుంబాల్లో చిచ్చు

### టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడి

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): ఓ మీడియా చానల్‌పై బీఆర్ఎస్ శ్రేణుల దాడిని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఖండించారు. కేసీఆర్, కేటీఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదని స్పష్టంచేశారు. సినీతారల ఫోన్ ట్యాపింగ్ ఎందుకు చేయాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌తో సినీ తారల కుటుంబాల్లో చిచ్చు పెట్టారని ఆరోపించారు. జడ్జిలు, మహిళా అధికారుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని అన్నారు. వాళ్ల టార్గెట్ నేతలు అయితే.. ఇంట్లో మహిళల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేశారు? అని నిలదీశారు. అభ్యంతరం ఉంటే న్యాయపరంగా ముందుకెళ్లాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఈదురుగాలులతో వానలు: ఐఎండీ

రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర గుజరాత్ మీదుగానున్న ఉపరితల ఆవర్తం నుంచి వాయవ్య బంగాళాఖాతం, దానికి ఆనుకొని ఉన్న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఉత్తర ఒడిశా మీదుగా అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతూ, సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని, ఎత్తుకు వెళ్లే కొలది దక్షిణ దిశగా వంగి ఉందని తెలిపింది. దీంతో రాష్ట్రంలో 3 రోజులు వానలు కొనసాగుతాయని వెల్లడించింది. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండలో బలమైన ఈదురుగాలులతో కూడిన వానలు కొనసాగుతాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## బాల్క సుమన్‌పై కేసు

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): పోలీసులను అడ్డుకున్న ఘటనలో బీఆర్ఎస్ నేతలు మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ బాల్క సుమన్ సహా పలువురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మీడియా చానల్‌పై దాడి చేశారంటూ బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు తెలంగాణ భవన్‌కు వెళ్లగా, బీఆర్ఎస్ నేతలు వారిని అడ్డుకున్నారు. విధులకు ఆటంకం కలిగించారంటూ బీఆర్ఎస్ నేతలపై బంజారాహిల్స్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు.

## జాగృతి విదేశీ అధ్యక్షుల నియామకం

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): పలు దేశాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షులను నియమిస్తూ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్ణయం తీసుకున్నారు. వారి పేర్లను ప్రకటించిన ఆమె.. త్వరలోనే ఆయా దేశాల్లో పూర్తిస్థాయి కమిటీలను వెల్లడిస్తామని తెలిపారు. వీటితో పాటు మహారాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా శ్రీనివాస్ సుల్గేను నియమించారు.

### వైద్యారోగ్యశాఖలో 16 వేల మంది

## పదవీ కాలం పొడిగింపు

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): వైద్యారోగ్యశాఖలోని డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, హానరోరియం, మల్టీటాస్కింగ్ విధానంలో పని చేస్తున్న 16 వేల మంది సిబ్బంది పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంఈ పరిధిలో రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్ధతిలో 4,772 మంది, ఔట్ సోర్సింగ్ విధానంలో 8,615 మంది, హానరోరియమ్ పోస్టుల్లో 3,056 మంది, ఎంటీఎస్ విధానంలో ఐదుగురు పనిచేస్తున్నారు. మొత్తం 16,448 మంది ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ ఆసుపత్రులు, నర్సింగ్, డెంటల్ కాలేజీల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో టీచింగ్ ఫ్యాకల్టీ సహా నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, డీఈఓలు, నాలుగో తరగతి ఉద్యోగులు ఉండటం గమనార్హం. డీఎంఈ విభాగంలో సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆదేశాలు 2026 మార్చి 31వరకు కొనసాగనున్నాయి.

## పూర్ణచందర్‌కు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జర్నలిస్టు, యాంకర్ స్వేచ్ఛ ఆత్మ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు లో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్ణచందర్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. శనివారం రాత్రి పోలీసుల ఎదుట లొంగిపోగా.. పోలీసులు ఆదివారం జడ్జి ముందు హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూ ర్తి,.. రిమాండ్ విధించడంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## కోడెల సంరక్షణకు ప్రాధాన్యం

### తిప్పాపూర్ గోశాలలో 137 జతల కోడెల పంపిణీ

వేములవాడ,జూన్ 29 (ఈవార్తలు): కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన రైతులకు 137 జతల కోడెలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో రాధాభాయి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కృష్ణ రెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చెల్లికి పెళ్లి మళ్లీ మళ్లీ అన్నట్లు బీజేపీ తీరు

### కొత్త బిల్డింగ్‌లోకి పసుపు బోర్డు తాత్కాలిక ఆఫీస్.. పసుసు రైతులకు మద్దతు ధర ఏది?.. మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): నిజామాబాద్‌లో జరిగిన బీజేపీ రైతు సమ్మేళన సభపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. నిజమాబాద్‌లో అమిత్ షా ప్రోగ్రాం చూస్తే సినిమాలో తనికెళ్ళ భరణి చెప్పే కవిత్వంలా మా చెల్లికి పెళ్లి.. జరగాలి మళ్లీ మళ్లీ అన్నట్లే ఉందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇంతకుముందే ప్రారంభించిన పసుపు బోర్డు తాత్కాలిక కార్యాలయాన్ని మరొక బిల్డింగ్‌లోకి మార్చి అమిత్ షాతో ప్రారంభిస్తుంటే రైతులు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పసుపు పంటకు మద్దతు ధర ఏదని ప్రశ్నించారు. అమిత్ షా ప్రసంగంలో రాజకీయ అంశాలు తప్ప మద్దతు ధర, బోర్డుకు నిధులు, శాశ్వత భవన విషయం ఏమీ లేవని తెలిపారు. మొదటి నుంచీ పసుపు రైతులను బీజేపీ మాయమాటలతో మోసం చేస్తూనే ఉందని విమర్శించారు. జాతీయ పసుపు బోర్డు కోసం, పసుపుకు మద్దతు ధర కోసం నిజామాబాద్ రైతులు దాదాపు నాలుగు దశాబ్దాలుగా పోరాటం చేశారని గుర్తుచేశారు. 'మా తండ్రి వేముల సురేందర్ రెడ్డి, కోటపాటి నరసింహానాయుడు పోరాటంతో రైతులు జాగృతం అయ్యారు. 2014-18 మధ్య ఎంపీ కవిత, ఎమ్మెల్యేలుగా మేం పోరాటం చేసినా కేంద్రం సహకరించలేదు. 2019 ఎన్నికల్లో గెలిపిస్తే 5 రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని, పసుపుకు, ఎర్రజొన్నకు మద్దతు ధర ఇస్తామని బాండ్ పేపర్‌పై రాసి బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ గెలిచాడు. 2022లో పసుపు బోర్డు బదులు సుగంధ ద్రవ్యాల బోర్డు ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని రైతులు వ్యతిరేకించారు' అని వెల్లడించారు. 'రాజకీయంగా ఇబ్బంది అవుతుందని.. మళ్లీ 2023లో ప్రధాని మోదీ పసుపుబోర్డు ప్రకటించారు. సంవత్సరం తర్వాత.. ఈ ఏడాది జనవరి 14న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పసుపు బోర్డును మొదటిసారి ప్రారంభించారు. బీజేపీ నాయకుడు పల్లె గంగారెడ్డిని చైర్మన్‌గా నియమించారు. అప్పటికే కిరాయి భవనంలోనే కొనసాగుతున్న స్పైసెస్ బోర్డు ఎక్స్‌టెన్షన్ కార్యాలయాన్ని తాత్కాలిక జాతీయ పసుపు బోర్డు కార్యాలయంగా మార్చారు. కానీ 2025 మార్చి కేంద్ర బడ్జెట్‌లో రబ్బర్ బోర్డు, స్పైసెస్ బోర్డు వంటి ఇతర బోర్డులకు నిధులు కేటాయించినట్లు నిజామాబాద్ పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదు. నిధులు లేకుండా, ఈ బోర్డు రైతులకు ఏం చేస్తుంది? బోర్డు ఏర్పాటు అయిన తర్వాత మొన్న సీజన్‌లో పసుపు ధర ఎక్కువ శాతం 8000 -10000 పలికింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకు బీజేపీపై కోపముంది. మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున ఉన్నట్టుండి పసుపు బోర్డు ప్రారంభోత్సవానికి మళ్లీ బీజేపీ తెర తీసి మళ్ళీ ఒక డ్రామా ఆడింది' అని ధ్వజమెత్తారు. ఆదివారం ఆ తాత్కాలిక కార్యాలయాన్ని అమిత్ షా రెండోసారి అధికారికంగా ప్రారంభించారని దుయ్యబట్టారు.

# పనితీరు బాగా లేకుంటే గుడ్‌బై

## కొందరు ఎమ్మెల్యేలకు తప్పులు చెప్తున్నా.. - 2029 ఎన్నికలే కౌంట్‌డౌన్‌గా పనిచేస్తున్నా

- **నేతలు ప్రతి ఇంటి గడపను తాకాల్సిందే**
- **ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే**
- **ఆగస్టు 15 నుంచి వాట్సాప్‌లో 703 సేవలు**
- **ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

అమరావతి, జూన్ 29 (ఈవార్తలు): ఎమ్మెల్యేల పనితీరు బాగా లేకుంటే వారికి గుడ్‌బై చెప్పేస్తానని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని, ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారని అన్నారు. టీడీపీ , జనసేన, బీజేపీ సమన్వయంతో ముందుకెళ్తున్నాయని, ఈ నేపథ్యంలో నేతలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 'విభజనతో సమస్యలు వచ్చినా నిలదొక్కుకున్నాం. వైసీపీ పాలనతో రాష్ట్రం ధ్వంసమైంది. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తామని ప్రజలకు చెప్పాం. ప్రజలు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. ఐదేళ్లలో మనం ఏం చేయాలనేదానిపై ఇప్పటికే చర్చించాం. ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. అది మన బాధ్యత. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. భవిష్యత్తులో ఏం చేస్తామో స్పష్టంగా చెప్పాలి. ఎన్నికల్లో దామాషా ప్రకారం అందరికీ న్యాయం చేశాం. 2014-19 మధ్య చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం. అయితే, బ్లాక్ మెయిల్ రాజకీయాలు ఎప్పుడూ చేయం. కేంద్రం మనకు బాగా సాయం చేస్తోంది. సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయని చెప్పడం లేదు. ఇంకా చాలా పరిష్కరించాలి. అదే మన లక్ష్యం. సేవ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచి ఇస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభిస్తాం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేశాం. రాజధాని ప్రాంతంలో పనులను పట్టాలెక్కించాం. పోలవరానికి రూ.12,500 కోట్లు కేంద్రం ఇచ్చింది. రాబోయే ఏడాదిన్నరలో ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 నాటికి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,400 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మరో నాలుగైదు నెలల్లో అది లాభాల బాట పడుతుంది. ఆగస్టు 15 నాటికి 703 సేవలు వాట్సాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పాలన అందించే అవకాశం ఉంటుంది. భవిష్యత్తుపై ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యత మనపై ఉంది. ప్రజాసేవ చేసే కుటుంబాలను ప్రోత్సహిస్తున్నాం. మన ప్రవర్తన, అలవాట్లలో తప్పులుంటే మార్చుకుందాం. కొందరు ఎమ్మెల్యేలను పిలిచి వ్యక్తిగతంగా మాట్లాడుతున్నా. మొహమాటం లేదు. వారి తప్పులేంటో స్పష్టంగా చెప్తున్నా. రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. వివేకాను చంపి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమయ్యారు. నిందితులను అప్పుడే అరెస్ట్ చేసుంటే ఫలితాలు మరోలా ఉండేవి. కోడికత్తి, గులక రాయి డ్రామాలు చూశాం. ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా రాజకీయాలు చేస్తున్నారు. గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లను ఎవరైనా పరామర్శిస్తారా? సత్తెనపల్లి పర్యటనలో తన కారు కింద వ్యక్తి పడినా జగన్ కనీసం పట్టించుకోలేదు. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ చనిపోతే మనమే కారణమన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పడంతో నేతలంతా ముందుండాలి. సోషల్ మీడియాలో మరింత జాగ్రత్తగా ఉండాలి. 2029 ఎన్నికలే నా టార్గెట్. పనితీరు బాగా లేకుంటే మొహమాటం లేకుండా గుడ్‌బై చెప్పేస్తా. వచ్చే ఎన్నిక ల్లో గెలిచేందుకు కౌంట్ డౌన్ పెట్టుకుని పనిచేస్తు న్నాం. తానా, ఆటా అంటూ విదేశీ పర్యటనలు వద్దు. అలా వెళ్తే టాటా చెప్పేస్తా. ప్రజాప్రతినిధుల గ్రాఫ్ పెరుగు తుందా? తగ్గుతుందా? పరిశీలిస్తున్నా. మొదటి ఏడాది పాలన పూర్తయింది.. రెండో ఏడాది ప్రారంభమైంది. నెల రోజులపాటు ప్రతి గడపకూ నేతలు వెళ్లాలి' అని తేల్చి చెప్పారు.





## మన సీటు ప్రజల నిర్ణయమే: నారా లోకేశ్

అమరావతి, జూన్ 29 (ఈవార్తలు): అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నట్లే వ్యవహరించాలని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలు పరిష్కరించేందుకు కష్టపడాలని పార్టీ నేతలకు సూచించారు. టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడిన ఆయన.. వైసీపీ 151 సీట్లు 11 అయ్యాయంటే దానికి కారణం వారి అహంకారమేనని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తల్లికి వందనం అమలు చేశామని తెలిపారు. పద్ధతి ప్రకారం ఇచ్చిన ప్రతి హామీ పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తేల్చిచెప్పారు. దేశం, ప్రపంచం మొత్తం తిరిగినా తిరిగి వచ్చేది మనం పవిత్ర దేవాలయంలా భావించే పార్టీ కార్యాలయానికేనని చెప్పారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడిచేస్తే పట్టించుకోని పరిస్థితి గత ప్రభుత్వ పాలనలో చూశామని తెలిపారు.

### పెద్దారెడ్డితో ఉంటారా.. సంగతి చూస్తా

**మద్దతిస్తే రప్పా రప్పా నరికేస్తాం: జేసీ వార్నింగ్**

అనంతపురం, జూన్ 29 (ఈవార్తలు): 'కేతిరెడ్డి పెద్దారెడ్డి వెంట ఎవరూ తిరగొద్దు. పెద్దారెడ్డికి మద్దతుగా ఉండే వారిని గుర్తిస్తాం.. ఫోటోలు తీస్తున్నాం. పెద్దారెడ్డిని మద్దతు ఇచ్చే వారిని రప్పా..రప్పా.. అని నరికేస్తాం' అని టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. తాడిపత్రి టీడీపీ శ్రేణులకు వైసీపీ కార్యకర్తలు శత్రువులు కాదని, పెద్దారెడ్డి మాత్రమే శత్రువు అని స్పష్టం చేశారు. కాగా, ఏడాది తర్వాత పెద్దారెడ్డి తాడిపత్రిలోని తన నివాసానికి వెళ్లటంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.

## పప్పూ నిద్ర వదులు

**ఈసెట్ ఫలితాలు వచ్చి 45 రోజులాయే**

**ఇంకా కౌన్సెలింగ్ మొదలు పెట్టలేదేం?**

**ఏపీ సర్కారుపై వైఎస్ జగన్ ఘాటు విమర్శలు**

తాడేపల్లి, జూన్ 29 (ఈవార్తలు): ఏపీ ఈసెట్ రిజల్ట్స్ వచ్చి 45 రోజులవుతున్నా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకపోవడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. ఇది ఏపీ విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనమని ధ్వజమెత్తారు. 'రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందనడానికి ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ. ఈసెట్ రిజల్ట్స్ వచ్చి దాదాపు 45 రోజులు అవుతున్నా కౌన్సిలింగ్ ప్రారంభం కాలేదు. రేపటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు క్లాసులు ప్రారంభం అవుతున్నాయి. ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో అడ్మిషన్ల కోసం 34 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షలు రాస్తే అందులో 31,922 మంది ఉత్తీర్ణత సాధించారు. గతనెల మే 15న ఫలితాలు వెలువడినా, ఇప్పటికీ కౌన్సెలింగ్‌పై షెడ్యూల్ విడుదలచేయకపోవడం, ఆ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం, విద్యావ్యవస్థలో నెలకొన్న దారుణ పరిస్థితులకు మరో నిదర్శనం. పప్పూ నిద్ర వదులు' అని విమర్శించారు.

### బంగారం గని కూలి 11మంది మృతి

న్యూఢిల్లీ: తూర్పు సూడాన్‌లో ఓ బంగారు గని కూలి 11 మంది కార్మికులు దుర్మరణం చెందారు. తూర్పు నైలు నది ప్రావిన్స్‌లోని హౌయిడ్ పట్టణంలో కెర్ష్ అల్-ఫీల్ గని కూలిపోయినట్లు సుడానీస్ మినరల్ రిసోర్సెస్ లిమిటెడ్ కంపెనీ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. మరణించినవాళ్లంతా మైనర్లేనని తెలిసింది. ఈ ఘటనలో మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రిలో చేర్పించినట్లు సదరు కంపెనీ పేర్కొంది. ఘటన నేపథ్యంలో గనిలో తవ్వకాలు నిలిపివేసినట్లు తెలిపింది.



# కేతిరెడ్డి పెద్దారెడ్డి అరెస్ట్

తాడిపత్రి, జూన్ 29 (ఈవార్తలు): తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఏడాది తర్వాత పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లటంతో.. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఉదయం తన నివాసంలో అరెస్టు చేశారు. తాడిపత్రిలో ఉండరాదంటూ ఆంక్షలు విధించారు. రహస్య ప్రాంతానికి తరలించగా.. ఇప్పటికే పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లొచ్చన్న హైకోర్టు అనుమతిచ్చిన విషయాన్ని పోలీసులకు పెద్దారెడ్డి గుర్తు చేశారు. దీంతో పెద్దారెడ్డిని అనంతపురం తరలించి, ఇంట్లో వదిలిపెట్టారు. ఈ ఘటనలో పోలీసుల తీరుపై పెద్దారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తాడిపత్రి వెళ్లేందుకు హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా, పోలీసులకు ఇబ్బంది ఏంటి? అని ప్రశ్నించారు. పోలీసులకు జేసీ ప్రభాకర్ రెడ్డి అనుమతి కావాలా? తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి గూండాగిరిని ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి దౌర్జన్యాలను పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు గుప్పించారు.

### పోలీసుల తీరును ఖండిస్తున్నాం: శైలజానాథ్

పోలీసుల తీరును ఖండిస్తున్నాం. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. తాడిపత్రి వెళ్లిన పెద్దారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేశారు? పెద్దారెడ్డిపై పోలీసుల ఆంక్షలు ఎందుకు? ఓ మాజీ ఎమ్మెల్యేని లాక్కొని వస్తారా? ఇప్పటికైనా పోలీసులు చట్టాన్ని కాపాడాలి. పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అనుమతించాలి. ఎస్పీ జగదీశ్ బాధ్యతగా ప్రవర్తించాలి. ఏకపక్షంగా వ్యవహరించవద్దు.

### రెడ్ బుక్ రాజ్యాంగం: కాటసాని రామిరెడ్డి

ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేసిన రాక్షస ప్రభుత్వం మెడలు వంచి హామీలను నెరవేర్చేంతవరకు పోరాడతాం. బాండ్లు ఇచ్చి మరీ హామీ ఇచ్చారు.. ఇచ్చిన హామీలు ఏమయ్యాయి. ప్రజలను మోసం చేసిన చంద్రబాబుపై ఫిర్యాదు చేస్తాం. పోలీసులు కేసు నమోదు చేస్తారా? రాజ్యాంగ విరుద్ధంగా రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులను పీడిస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో మైనింగ్ వ్యాపారులను బెదిరించి కేసులు, జరిమానాలు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

# బంగ్లాదేశ్ లో హిందూ మహిళపై అత్యాచారం

**వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్.. ఐదుగురు అరెస్టు.. మైనారిటీలపై తీవ్రమైన దాడులు.. పెరుగుతున్న ఆందోళన**

ఢాకా: బంగ్లాదేశ్‌లో దారుణం జరిగింది. ఓ హిందూ మహిళపై అత్యాచారానికి ఒడిగట్టడమే కాకుండా, ఆ దారుణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొమిల్లా జిల్లాలోని మురాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌చంద్రాపూర్ పంచకిట్టలో గురువారం ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన 36 ఏళ్ల అలీ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అఘాయిత్యాన్ని గమనించిన స్థానిక గ్రామస్థులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అయితే, అతడు వారి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న కొందరు బాధితురాలిని అసహాయ స్థితిలో వీడియో తీసి, దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో క్షణాల్లో వైరల్ అయింది. బాధితురాలు తన పరువు




కాపాడాలంటూ వేడుకుంటున్న దృశ్యాలు తీవ్ర ఆందోళన కలిగించాయి. ఘటనపై మురాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావటంతో రంగంలోకి దిగిన పోలీసులు, ప్రధాన నిందితుడు అలీతో పాటు, వీడియోను రికార్డ్ చేసి వ్యాప్తి చేసిన మరో నలుగురిని అరెస్ట్ చేశారు. కాగా, ఈ ఘటన ఈ ఘటన బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, మహిళలపై జరుగుతున్న హింసపై మరోసారి

## విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో చోరీకి యత్నం.. రైల్వే పోలీసుల కాల్పులు

పిడుగురాళ్ల, జూన్ 29 (ఈవార్తలు): ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు వద్ద విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో దుండగులు చోరీకి యత్నించారు. వెంటనే అప్రమత్తమైన రైల్వే పోలీసులు మూడు రౌండ్లు కాల్పులు జరపడంతో దుండగులు పారిపోయారు. పిడుగురాళ్ల సమీపంలో బీహార్, మహారాష్ట్ర ముఠాలు వరుసగా రైళ్లలో చోరీకి పాల్పడుతున్నాయి. వారంలో రెండు సార్లు దొంగతనాలకు పాల్పడ్డారు. మరోసారి చోరీకి యత్నించడంతో పోలీసులు కాల్పులు జరిపారు. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వైపు విశాఖ ఎక్స్‌ప్రెస్ వస్తుండగా.. ఆదివారం తెల్లవారుజామున రైలులోకి చొరబడిన దొంగలు ప్రయాణికుల సొమ్మును దొంగిలించేందుకు ప్రయత్నించారు. రైల్వే పోలీసులు అప్రమత్తమై దుండగులను అడ్డుకున్నారు. గాల్లోకి మూడుసార్లు కాల్పులు జరపడంతో రైల్లోంచి దూకి పరారయ్యారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## సోషల్ వాణి

### పెద్దల సభలో చిన్నబుద్ధులున్నవాడు

**దేశపతి శ్రీనివాస్..** ఈ పేరు తెలంగాణ ఉద్యమంలో ప్రముఖంగా వినిపించిన పేరు. స్వతహాగా తన సామాజిక నేపథ్యం మూలంగా వచ్చిన భాష, చతురతతో కేసీఆర్‌ను ఆకట్టుకొని అతని పక్కన చేరాడు. కేసీఆర్ కూడా రాజుల దగ్గర మంత్రులుగా ఫలానా కులంవాళ్ళకే అర్హత ఉంటుందనే వెర్రి నమ్మకంతో ఇతగాన్ని చేరదీసాడు. దాన్ని ఆసరా చేసుకుని, తెలుగు ఉపాధ్యాయుడుగా తనకున్న భాషా పరిజ్ఞానంతో తెలంగాణ ఉద్యమ వేదికలపై స్థానం సంపాదించుకున్నాడు. తాను కలంపట్టి వ్రాసిన సాహిత్యం పెద్దగా లేకున్నా మంది పాటలు తనవిగా భ్రమింపజేస్తూ ఉద్యమ వేదికలపై గాయకుడిగా ముద్ర వేయించుకున్నాడు. వాస్తవంగా ఇంతకంటే గొప్పగా పాడే గాయకులు ఎంతోమంది ఉన్నా కేసీఆర్ ప్రాపకంతో వేదికలపై వారికి అవకాశం రాకుండా చేసాడు.అంతకు ముందు తాను పనిచేసిన సంస్థల్లో కులం కార్డును వాడుకుని ప్రధాన వక్తల్లో చేరిపోయాడు. అధ్యక్ష స్థానాలు కూడా కొట్టేశాడు. పచ్చి కులవాది అయిన దేశపతి విప్లవ, ప్రజా సంఘాలతో కలిసి నడుస్తూ అభ్యుదయవాది అనే పేరు సంపాదించాడు. టీఆరెస్ అధికారంలోకి వచ్చాక అర్హత లేకపోయినా, వేరేవారికి దక్కాల్సిన ఉద్యోగాలను తన కులం వాళ్ళకే ఇప్పించుకున్న అభ్యుదయవాది ఈ దేశపతి. చిన్న కులాల పట్ల చిన్నచూపు ఉండే ఈ వ్యక్తి అవసరానికి వాళ్ళను వాడుకోవటంలో మాత్రం పీహెచ్డీ చేశాడు. కేవలం తమ కులంవాడు అనే అభిమానంతోనో, ఇతని మాటల గారడీతోనో కొందరు విప్లవ పార్టీల ప్రతినిధులు ఇతనికి ఎక్కడలేని ఎలివేషన్ ఇచ్చారు. ఇతను మాత్రం చొక్కా నలగని ఉద్యమాల్లో ముందు నడుస్తూ వీరవిహారం చేశాడు. వాళ్ళు అనుకున్నట్టు ఇతను లెఫ్టూ కాదు, రైటూ కాదు.. స్ట్రెయిట్. ఎక్కడ తనకు లాభం జరిగితే అక్కడుంటాడు. ప్రజా సంఘాల మీటింగుల్లో మైకుల ముందు గొంతు చించుకునే ఈ వీర ఉద్యమకారుడు, వీపులు పగిలే నిరసనలను మాత్రం లౌక్యంగా తప్పించుకుంటాడు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్నాళ్లు ఆడింది ఆటగా, పాడింది పాటగా నడిచిన ఇతని వ్యవహారం వల్ల ఎంతోమంది నిజమైన ఉద్యమకారులు నష్టపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం దగ్గరికి వెళ్లటానికి ఇతనే ప్రధాన అడ్డంకిగా ఉన్నాడని, అక్కడ తమ గురించి తప్పుడు సమాచారం ఇస్తున్నాడని నాతోనే చెప్పుకుని బాధపడ్డ ఉద్యమకారులు ఎందరో ఉన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓఎస్డీగా విశేష అధికారాలు చెలాయించి చాలామంది మేధావులు, నాయకుల గళాల్ని ప్రభుత్వం దగ్గర వినిపించకుండా అడ్డుకున్నాడు. తనకు సంబంధం లేని సమాచారశాఖలో వేలుపెట్టి, ప్రకటనల ద్వారా బినామీల పేరుతో కోట్లు కొల్లగొట్టిన వ్యవహారం యాడ్ ఫిల్మ్ మేకర్స్‌తో పాటు ప్రభుత్వానికి కూడా తెలుసు. ఈ రోజు స్వేచ్ఛ మరణానికి కారకుడు అని చెప్తున్న వ్యక్తిని యాడ్స్ ద్వారా ఆర్థికంగా బలవంతుడిని చేసింది, బరితెగించేలా చేసింది కూడా ఈ దేశపతి అనబడే వ్యక్తే . స్వేచ్ఛ మరణించాక అమ్మా తల్లీ అంటూ ముందు పోస్ట్ పెట్టింది కూడా ఇతనే. అంత తెలివిగలవాడు ఈ దేశపతి. ఆమెను ఆత్మహత్యకు పురికొల్పిన వ్యక్తి నేరస్తుడైతే, అతనికి అన్నివిధాలుగా అండదండలు అందించిన దేశపతి కూడా నేరస్తుడే..!

– ప్రేమ్‌రాజ్ ఎనుముల, సినిమా డైరెక్టర్




## జూలై 1 నుంచి కొత్త రూల్స్ ఇవే..

- రైలు టికెట్ బుకింగ్‌కు ఆధార్ అథెంటికేషన్: ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా ఐఆర్‌సీటీసీ యాప్ ద్వారా తత్కాల్ టికెట్స్ బుకింగ్ చేసుకోవాలంటే ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరి. జూలై 15 నుంచి వన్ టైమ్ పాస్‌వర్డ్ తప్పనిసరి. బుకింగ్ విండో ఓపెన్ అయిన 30 నిమిషాల్లోనే టికెట్లు బుక్ చేసుకోవాలి. ఏసీ తత్కాల్ టికెట్లు ఉదయం 10 నుంచి 10:30 వరకు, నాన్ ఏసీ తత్కాల్ టికెట్లు 11 నుంచి 11:30 వరకు మాత్రమే బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.
- యూపీఐ చార్జ్ బ్యాక్ రూల్స్: నేషనల్ పేమెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా యూపీఐ చార్జ్ బ్యాక్ రూల్స్‌లో మార్పులు తీసుకురానుంది. ఇప్పటి వరకు చార్జ్ బ్యాక్ రిక్వెస్ట్ తిరస్కరణకు గురైతే బ్యాంకు ఎన్‌పీసీఐని సంప్రదించాల్సి వచ్చేది. జూలై 1వ తేదీ నుంచి ఎన్‌పీసీఐ జోక్యం ఉండదు. ఎన్‌పీసీఐ ఆమోదం లేకుండానే బ్యాంకులు చార్జ్ బ్యాక్‌ను ప్రాసెస్ చేయనున్నాయి.
- పాన్‌కు ఆధార్ తప్పనిసరి: జూలై 1వ తేదీ నుంచి కొత్త పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు తప్పనిసరి. పాన్ కార్డు తీసుకోవాలంటే ఆధార్ వెరిఫికేషన్‌ను తప్పనిసరి చేస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ నిర్ణయం తీసుకుంది.





# 477 డ్రోన్లు.. 60 క్షిపణులు

## ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి.. దీటుగా ఎదుర్కొన్నామన్న ఉక్రెయిన్

మాస్కో: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా శనివారం రాత్రి అతి పెద్ద గగనతల దాడి చేసింది. మొత్తం 537 ఆయుధాలను రష్యా ప్రయోగించింది. వీటిల్లో 477 డ్రోన్లు, 60 క్షిపణులు ఉన్నాయని ఉక్రెయిన్ వాయుసేన వెల్లడించింది. 249 డ్రోన్లను కూల్చేశామని, మరో 226 ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థల ప్రభావంతో కూలిపోయాయని తెలిపింది. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని రష్యా ఆయుధాలను ప్రయోగించిందని ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమ్యూనికేషన్ కమాండర్ యూరీ ఇహ్నాట్ తెలిపారు. పోలాండ్ గగనతల రక్షణ కోసం మిత్రదేశాల యుద్ధ విమానాలు రంగంలోకి దిగాయని వెల్లడించారు. ఖేర్సాన్ ప్రావిన్స్‌లో జరిగిన దాడుల్లో ఒకరు మరణించారని వివరించారు. ఈ దాడిలో ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం కూలిపోయి, పైలట్ ప్రాణాలు కోల్పోయాడని చెప్పారు.

### రష్యాలో వేర్పాటువాదానికి పాశ్చాత్య దేశాల కుట్ర: పుతిన్

రష్యాలో వేర్పాటువాదాన్ని పశ్చిమ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని, ఉక్రెయిన్‌తో యుద్ధంలో జోక్యం చేసుకుంటున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. బెలారస్ రాజధాని మిన్స్క్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రష్యాకు వ్యతిరేకంగా ఇస్లామిక్ స్టేట్ పనిచేస్తున్నంత కాలం ఎవరూ దానిపై దృష్టి సారించరు. మాస్కోలో పేలుళ్లు నేటికీ జరుగుతున్నాయి. మా దేశంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించి, మాపై పోరాటానికి ఉగ్రవాదాన్ని సాధనంగా ఎంచుకున్న పశ్చిమదేశాల విషయంలో కూడా ఇదే జరిగింది. నాటో విస్తరణ, ఉక్రెయిన్‌తో వివాదాన్ని పరిష్కరించడం లాంటి వాగ్దానాలు ఇచ్చి వాటిని నిలబెట్టుకోకుండా పశ్చిమ దేశాలు రష్యాను పదేపదే మోసం చేస్తున్నాయి' మండిపడ్డారు.



# హమాస్‌తో ఒప్పందం చేసుకోండి

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై ట్రంప్ ఒత్తిడి


న్యూయార్క్ : గాజాలో జరుగుతున్న యుద్ధాన్ని వేగంగా ముగించి, హమాస్‌తో ఒప్పందం చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరారు. ఈ మేరకు సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు పెట్టారు. 'గాజాలో ఒప్పందం చేసుకోండి. బందీలను వెనక్కి తీసురండి' అని వ్యాఖ్యానించారు. నెతన్యాహుపై కేసులను వదిలేయాలని ఇజ్రాయెల్ ప్రాసిక్యూటర్లను అభ్యర్థించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ పోస్టు చేయడం గమనార్హం. ఇజ్రాయెల్ ప్రధాని ప్రస్తుతం హమాస్‌తో చర్చలు జరుపుతున్నారని, ఆ ఒప్పందం కుదిరితే బందీలు వెనక్కి వస్తారని ట్రంప్ తెలిపారు.

### హమాస్ కీలక నేత హతం

గాజాపై చేసిన దాడుల్లో హమాస్ సహ వ్యవస్థాపకుడు, సైనిక విభాగ కీలక నేత అయిన మహమ్మద్ ఇస్సా అల్-ఇస్సాను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. గాజాలోని సబ్రా ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో అతడు మరణించినట్లు తెలిపింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడికి అతడే ప్రణాళిక రచించి, అమలు చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. టెల్ అవీవ్‌పై హమాస్ చేసిన మరిన్ని దాడుల్లో కూడా ఇస్సా హస్తం ఉన్నట్లు తెలిపింది. దాడుల్లో దెబ్బతిన్న గాజాలోని హమాస్ సంస్థాగత వ్యవస్థలను పునరుద్ధరించడానికీ అతడు పని చేస్తున్నట్లు గుర్తించామన్నారు. మహమ్మద్ ఇస్సా గతంలో గాజా స్ట్రిప్‌లో హమాస్ బలగాలను తయారు చేయడం, వారికి శిక్షణనివ్వడంలో కీలక పాత్ర పోషించాడు.

# పాక్‌కు భారంగా భారత బ్యాన్

## షిప్పింగ్ కోసం అధిక మొత్తంలో చెల్లింపులు



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు సరుకులు తీసుకెళుతున్న నౌకలు భారత్ ఓడరేవుల్లోకి రావడంపై విధించిన నిషేధం ఆ దేశంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నిర్ణయంతో షిప్పింగ్ కోసం పాక్ ప్రభుత్వం అధిక మొత్తంలో రుసుము చెల్లించాల్సి వస్తోందని డాన్ పత్రిక తన కథనంలో పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా మే 2న పాక్ నౌకలపై బ్యాన్ విధించింది. భారత్ పోర్టుల నుంచి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాక్ సరుకులు రవాణ కాకుండా ఈ చర్యను చేపట్టింది. దీంతో పాకిస్థాన్‌పై భారీ ప్రభావం పడుతోంది. భారీ నౌకలు పాక్ రేవులకు వెళ్లటం లేదు. దీంతో ఆ దేశానికి దిగుమతులు, ఎగుమతుల్లో 30-50 రోజుల వరకు జాప్యం జరుగుతోందని కరాచీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ జావెద్ బిల్వాని తెలిపారు. దీంతో దిగుమతిదారులు ఫీడర్ వెస్సల్స్‌ను నమ్ముకోవాల్సి వస్తోందని వెల్లడించారు. ఈ ప్రభావంతో లాజిస్టిక్స్ ధరలు కూడా భారీగా పెరిగినట్లు చాలా మంది ఎగుమతిదారులు చెబుతున్నారు. బీమా ఖర్చులు పెరిగితే అంత ప్రభావం ఉండేది కాదని.. షిప్పింగ్ ధరలు కూడా పెరగడం ఇబ్బందిగా మారుతోందని ఓ ఎగుమతిదారు వివరించారు. ఇక.. పాక్‌లోని పరిశ్రమలకు ముడిపదార్థాల దిగుమతి కష్టాలు మరింత పెరిగాయి. ఇప్పటికే చాలా పరిశ్రమల దిగుమతులను అక్కడి ప్రభుత్వం నియంత్రిస్తోంది. విదేశీ మారకద్రవ్యం వల్ల ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత్ నిర్ణయంతో పంపిణీ వ్యవస్థలు మరింత దెబ్బతింటున్నాయి.



## అమెరికాలో భారత యువతి మిస్సింగ్

అమెరికాకు వెళ్లిన సిమ్రన్ అనే భారత యువతి (24) కనిపించకుండా పోయింది. పెళ్లి కోసం అక్కడికి వెళ్లిన ఆమె.. మిస్సింగ్ కావడం ఆందోళన కలిగిస్తోంది. ఫిర్యాదు అందుకున్న న్యూజెర్సీ పోలీసులు ఆమె కోసం గాలింపు మొదలుపెట్టారు. సిమ్రన్ జూన్ 20న భారత్ నుంచి న్యూజెర్సీకి చేరుకుంది. ఐదు రోజుల తర్వాత కనిపించకుండాపోయింది. దర్యాప్తు చేపట్టిన అధికారులు.. పెద్దలు కుదిర్చిన పెళ్లి కోసమే ఆమె అమెరికా వచ్చినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. ఆమెకు స్థానికంగా బంధువులు లేరని, ఇంగ్లిష్ కూడా రాదని గుర్తించారు. సిమ్రన్ వద్ద ఉన్న ఫోన్ వైఫైతోనే పనిచేస్తుందని, ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు భారత్‌లో ఉన్న కుటుంబసభ్యులను ఇంకా సంప్రదించలేకపోయామని వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు.. ఓ చోట ఆమె తన ఫోన్‌ను చూసుకుంటూ ఎవరికోసమో వేచిచూస్తున్నట్లు గుర్తించారు. ఆమెకు పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని, కేవలం అమెరికాకు ఉచితంగా వచ్చేందుకే దీనిని సాకుగా చూపిందనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## అత్యాచార ఘటన మీడియాతోనే తెలిసింది

### కోల్‌కతా లా కాలేజీ వైస్ ప్రిన్సిపల్

కోల్‌కతా: కోల్‌కతాలోని ఓ లా కాలేజీ విద్యార్థిని(24)పై పూర్వ విద్యార్థి, ఇద్దరు సీనియర్లు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ నయన ఛటర్జీ స్పందించారు. ఈ దారుణం జరిగినట్లు అసలు తమ దృష్టికే రాలేదని, మీడియాలో వార్తలు చూసే తాము విషయం తెలుసుకున్నామని చెప్పారు. అత్యాచారం జరిగినట్లు బాధితురాలు ఫిర్యాదు ఇచ్చిన మరుసటి రోజు పోలీసులు కాలేజీకి వచ్చారని.. అయితే, ఈ విషయం గురించి తమకు సమాచారం ఇవ్వలేదని వైస్ ప్రిన్సిపల్ పేర్కొన్నారు. తాము వచ్చిన విషయం సెక్యూరిటీ గార్డుకు కూడా చెప్పవద్దని పోలీసులు తనను కోరినట్లు చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని రెండు గదులను సీజ్ చేశారని తెలిపారు. బాధిత విద్యార్థిని కూడా ఈ విషయంపై కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేయలేదని వెల్లడించారు. అత్యాచార కేసులో ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా తమ పూర్వ విద్యార్థి అని, కాలేజీలో బోధనా సిబ్బంది తక్కువగా ఉండడంతో కొన్ని నెలల క్రితం అతడిని తాత్కాలిక అధ్యాపకుడిగా నియమించుకున్నామని వివరించారు.



## 90 డిగ్రీల వంతెన.. ఏడుగురు ఇంజినీర్ల సస్పెన్షన్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఇటీవల నిర్మించిన 90 డిగ్రీల మలుపు వంతెన ఘటనలో అక్కడి ప్రభుత్వం ఏడుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేసింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌పై శాఖాపరమైన దర్యాప్తనకు ఆదేశించింది. 'ఐష్‌బాగ్‌లో ఆర్వోబీ నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యంపై దర్యాప్తునకు ఆదేశించా. నివేదిక ఆధారంగా 8 మంది పీడబ్ల్యూడీ ఇంజినీర్లపై చర్యలు తీసుకున్నా. ఇందులో ఏడుగురు ఇంజినీర్లను తక్షణమే సస్పెండ్ చేశా. నిర్మాణ ఏజెన్సీ, డిజైన్ రూపొందించిన కన్సల్టెంట్‌లను బ్లాక్‌లిస్టులో చేర్చాం. ఆర్వోబీ పునరుద్ధరణ కోసం ఓ కమిటీని ఏర్పాటు చేశాం' అని సీఎం మోహన్ యాదవ్ తెలిపారు. కాగా, రూ.18 కోట్లతో నిర్మించిన ఈ వంతెనకు సంబంధించిన డిజైన్‌ను నిర్మాణ సంస్థ సమర్థించుకుంది. సమీపంలో మెట్రో రైల్ స్టేషన్, భూమి కొరత దృష్ట్యా ఇలా నిర్మించడం తప్పితే మరో మార్గం లేదని వివరణ ఇచ్చింది.

## కుట్రకోణంపైనా ఎయిరిండియా దర్యాప్తు: కేంద్రం



న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానం దుర్ఘటన కేసులో కుట్రకోణంపైనా దృష్టిపెట్టామని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తోందని వెల్లడించారు. పుణెలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ప్రమాదం జరిగిన విమానంలోని బ్లాక్‌బాక్స్ ఏఏఐబీ ఆధీనంలో ఉందని, విశ్లేషణ కోసం దానిని విదేశాలకు పంపబోమన్నారు. 'ఎయిరిండియా ఘటన అత్యంత విషాదం. ఈ ప్రమాదంపై ఏఏఐబీ పూర్తి స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. అన్ని కోణాలను పరిశీలిస్తోంది. కుట్ర ఉందా? అనే అంశంపైనా దృష్టి పెట్టింది. సీసీటీవీ దృశ్యాలను సంబంధిత అధికారులు విశ్లేషిస్తున్నారు. అనేక ఏజెన్సీలు దీనిపై పనిచేస్తున్నాయి. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం కావడం గతంలో ఎన్నడూ జరగలేదు. ఇది అరుదైన కేసు. దర్యాప్తు నివేదిక వస్తేనే నిజం తెలుస్తుంది. బ్లాక్‌బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణ నిక్షిప్తమై ఉంది. నివేదిక 3 నెలల్లో వస్తుంది. ఇప్పుడే దానిపై మాట్లాడటం తొందరపాటు అవుతుంది' అని వివరించారు. కాగా, బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపిస్తున్నారన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అది ఎక్కడికీ పోదని, దర్యాప్తు సంస్థల కస్టడీలో ఉందని స్పష్టం చేశారు. దేశంలో వాడుతున్న 33 డ్రీమ్‌లైనర్ విమానాలను డీజీసీఏ ఆదేశాల మేరకు క్షుణ్ణంగా తనిఖీలు చేశారని తెలిపారు.

# బిగ్ బ్యూటిఫుల్ బిల్లుతో ఉద్యోగాలు నాశనం

- ట్రంప్ నిర్ణయంపై మస్క్ మరోసారి విమర్శలు
- బిల్లుకు సెనేట్ ఆమోదం.. ట్రంప్ హర్షం

న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొస్తున్న బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై ఎలాన్ మస్క్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుపై సెనెట్‌లో ఓటింగ్ జరగడానికి కొన్ని గంటల ముందు మస్క్ ఎక్స్‌లో వరుస పోస్టులు చేశారు. ఈ బిల్లు అమెరికాలోని మిలియన్ల మంది ఉద్యోగాలను నాశనం చేస్తుందని తెలిపారు. దేశానికి అపారమైన హాని కలిగిస్తుందని వెల్లడించారు. ఇది విధ్వంసకర చర్య అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో పరిశ్రమలను కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. మరో పోస్టులో ఈ బిల్లు రిపబ్లికన్లకు రాజకీయ ఆత్మహత్య అని అభివర్ణించారు. ఇది రుణ పరిమితిని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచుతుందని తెలిపారు. కాగా.. బిగ్ బ్యూటి ఫుల్ బిల్లు సెనెట్‌లో ఆమోదం పొందింది. తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన ఈ ఓటింగ్‌లో 51-49 తేడాతో బిల్లుకు ఆమోదం లభించింది. ఈక్రమంలో డెమోక్రట్లందరూ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లు ఆమోదం లభించడంపై ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఇది గొప్ప విజయమని పేర్కొన్నారు. బిల్లుకు ఆమోదం తెలిపిన రిపబ్లికన్లకు ధన్యవాదాలు తెలిపారు. ఇది తమ ఆర్థిక వ్యవస్థను మెరుగు పరిచేందుకు,సరిహద్దు భద్రతను పెంచడానికి ఉపకరిస్తుందని వెల్లడించారు.

## పూరిలో తొక్కిసలాట.. ఎస్పీపై బదిలీ వేటు

ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో గుండిచా ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీని ఆ రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడ్డారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఆ రాష్ట్ర ప్రభుత్వం.. జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వైన్, పూరి ఎస్పీ వినిత్ అగర్వాల్‌ను బదిలీ చేసింది. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఖుర్దా కలెక్టర్ చంచల్ రాణా నూతన జిల్లా మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని, ప్రస్తుత ఏడీజీ (క్రైమ్) పినాక్ మిశ్రా ఎస్పీగా విధుల్లో చేరతారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 4.20 గంటల సమయంలో రథాలపై ఉన్న దేవతలను చూడటానికి గుండిచా ఆలయం వద్దకు భక్తులు భారీగా చేరుకోవడంతో తొక్కిసలాట నెలకొంది. ఈ ఘటనలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోగా..పలువురు గాయపడ్డారు. అధికారులు తగిన భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్లే తొక్కిసలాట నెలకొందని భక్తులు ఆరోపించారు. రద్దీకి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయలేదని, అంబులెన్సులు కూడా అందుబాటులో లేవని మండిపడ్డారు. ఘటనపై ఒడిశా సీఎం మోహన్ చరణ్ స్పందించారు. ప్రభుత్వం తరఫున భక్తులను క్షమాపణలు తెలియజేశారు. భద్రత వైఫల్యంపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. రథయాత్ర ముగిసే వరకు అసాధారణ ఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

## భారత్‌కు ముందుచూపు లేదు

### పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ మొసలి కన్నీరు

ఇస్లామాబాద్: భారత్ అకారణంగా రెండు సార్లు పాకిస్థాన్‌పై దాడికి పాల్పడిందని ఆ దేశ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ నోరుపారేసుకున్నారు. భారత్‌కు వ్యూహాత్మక ముందుచూపు కొరవడిందని ఆరోపించారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని, మరోసారి తమపై దాడికి పాల్పడితే నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. కరాచీలోని నావల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ స్థిరత్వాన్ని పాకిస్థాన్ కాపాడుతోందని, భారత్ దుందుడుకుతనానికి దీటుగా స్పందిస్తోందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు పాక్ ప్రయత్నిస్తుంటే.. భారత్ ఉద్రిక్తతలు సృష్టిస్తోందని అన్నారు.

## ఇజ్రాయెల్‌పై ఇంకా డౌటే

### బదులిచ్చేందుకు సిద్ధం: ఇరాన్

టెహ్రాన్: కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పాటిస్తుందా? అన్న అనుమానం ఉందని ఇరాన్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దుల్ రహీం మౌసావి తెలిపారు. ఒకవేళ ఆ దేశం మరోసారి దాడులు చేసినా, బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్‌తో ఆదివారం జరిగిన భేటీ సందర్భంగా మౌసావి ఈ వ్యాఖ్యలు చేశారు. 'కాల్పుల విరమణ షరతులకు ఇజ్రాయెల్ కట్టుబడి ఉంటుందా? లేదా? అన్నదానిపై మాకు సందేహాలున్నాయి. అందుకే అప్రమత్తంగా ఉన్నాం. శత్రుదేశం మరోసారి దాడులు చేస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించం. కచ్చితంగా బదులిస్తాం' అని వెల్లడించారు. ఇరాన్ ఇప్పటి వరకు యుద్ధం ప్రారంభించలేదని, ఇజ్రాయెల్ దాడులకు మాత్రమే ప్రతిస్పందించిందని వివరించారు.



## 3 నెలల్లో కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్

బెంగళూరు: మూడు నెలల్లో కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదవి చేపడతారని సొంత పార్టీ ఎమ్మెల్యే హెచ్ఏ ఇక్బాల్ హుస్సేన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక సీఎంగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని, ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందని అన్నారు. ఈ ఏడాది చివర్లో కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పు ఉంటుందన్న ఊహాగానాల నేపథ్యంలో శివకుమార్ సన్నిహితుడు ఇక్బాల్ హుస్సేన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు ఉంటాయని ఆ రాష్ట్ర మంత్రి కెఎన్ రాజన్న ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని కన్నడనాట విస్తృత చర్చ నడుస్తోంది.

# బిగ్‌బాస్-9లో సామాన్యులకూ అవకాశం

## రిటర్న్ గిఫ్ట్ అంటున్న అక్కినేని నాగార్జున






హైదరాబాద్, జూన్ 29 (ఈవార్తలు): రియాల్టీ షో బిగ్ బాస్-9లో సామాన్యులకూ అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. 'చదరంగం కాదు.. ఈసారి రణరంగం' అంటూ ఇటీవల బిగ్‌బాస్ సీజన్ 9 వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. తాజాగా ఆయన మరో ఆసక్తికర అప్‌డేట్‌ను ప్రేక్షకులతో పంచుకున్నారు. షోలోకి సామాన్యులను సైతం ఆహ్వానిస్తున్నామని తెలిపారు. 'ఇప్పటివరకూ మీరు బిగ్‌బాస్ షోను ఎంతో ప్రేమించారు. మీకు రిటర్న్ గిఫ్ట్‌గా ఏమివ్వాలి? మీరు ఎంతగానో ప్రేమించిన బిగ్‌బాస్ హౌస్‌లోకి ఎంట్రీయే రిటర్న్ గిఫ్ట్. ఈ సారి హౌస్‌లోకి సెలబ్రిటీలే కాదు. సాధారణ ప్రజలకూ అవకాశం ఉంది. వచ్చేయండి. బిగ్‌బాస్9 తలుపులు తెరిచి మీకోసం ఎదురు చూస్తున్నాయి" అని తెలిపారు. దీనికోసం %ఎ9.ంఙశీఝఱ్‌.ఝశీఎ% వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావాలని, బిగ్‌బాస్ హౌజ్‌లోకి వెళ్లేందుకు కారణం చెప్తూ వీడియో అప్‌లోడ్ చేస్తే, షరతుల మేరకు హౌజ్‌మేట్ అయ్యే చాన్స్ ఉంటుందని జియో హాట్‌స్టార్ వెల్లడించింది. అయితే, 'బిగ్‌బాస్9' వ్యాఖ్యాతగా నాగార్జునకు బదులు బాలకృష్ణ వస్తారంటూ ప్రచారం జరిగింది. కానీ, నాగార్జుననే కొనసాగుతున్నట్లు తాజా ప్రకటన కన్ఫార్మ్ చేసింది. ప్రస్తుతం బిగ్‌బాస్9 కోసం హౌజ్‌మేట్స్ ఎంపిక జరుగుతోంది. పలువురు సినీ, టెలివిజన్ నటులతో పాటు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌కు పిలుపు వచ్చినట్లు సమాచారం.



# అండర్ వరల్డ్ నుంచి బెదిరింపులతో భయపడ్డా: అమీర్ ఖాన్


'ఖయామత్ సే ఖయామత్ తక్' విజయం తర్వాత అండర్ వరల్డ్ నుంచి తనకు ఆహ్వానం అందిందని బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ తెలిపాడు. ఆ సమయంలో బెదిరింపులు కూడా ఎదుర్కొన్నానని చెప్పాడు. ఆ సమయంలో ఎంతో భయపడ్డానని చెప్పాడు. '1990ల్లో అండర్ వరల్డ్ నుంచి ఆహ్వానం అందింది. దుబాయ్ వేదికగా నిర్వహించనున్న పార్టీలో పాల్గొనాలని అడిగారు. అండర్ వరల్డ్‌కు చెందిన కొంతమంది నా ఇంటికి కూడా వచ్చారు. వాళ్లు ఎవరు? నన్ను ఎవరు పిలిచారు? అనే విషయాలను ఇప్పుడు చెప్పాలనుకోవడం లేదు. పార్టీకి నన్ను తీసుకువెళ్లడానికి ఎంతో ప్రయత్నించారు. ఎంత డబ్బు కావాలన్నా ఇస్తామన్నారు. ఎందుకంటే, నేను ఆ కార్యక్రమంలో పాల్గొంటానని అప్పటికే ప్రకటించారు. అది తమ పరువుకు సంబంధించిన విషయం అని అన్నారు. నేను మాత్రం వాళ్ల మాటలకు తలొగ్గలేదు. ఆ తర్వాత వాళ్లెప్పుడు నన్ను సంప్రదించలేదు. అయితే, ఆ టైంలో ఎంతో భయపడ్డా. వాళ్లతో మనకెందుకు. వాళ్లు చాలా పవర్‌ఫుల్' అని నా తల్లిదండ్రులు కూడా భయపడ్డారు. సల్మాన్ ఖాన్‌తో బంధంపై మాట్లాడుతూ.. ఆయనతో అందాజ్ అప్నా అప్నా కోసం కలిసి వర్క్ చేశానని, షూటింగ్‌కి సల్మాన్ టైమ్‌కి వచ్చేవాడు కాదని.. దాంతో తమ మధ్య సరిగ్గా మాటలు ఉండేవి కాదని తెలిపాడు. మొదటి భార్య రీనా దత్తా నుంచి విడిపోయినప్పుడు కుంగుబాటుకు లోనైతే.. సల్మాన్ తమ ఇంటికి వచ్చాడని వెల్లడించాడు. అప్పటి నుంచి తమ మధ్య స్నేహం ఏర్పడిందని వివరించాడు.





# 28 రోజుల్లోనే ఉప్పు కప్పురంబు షూటింగ్ పూర్తి

మహానటి ఫేమ్ కీర్తిసురేశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ఉప్పు కప్పురంబు. ఈ సినిమాలో నటుడు సుహాస్ కీలక పాత్ర పోషించారు. సెటైరికల్ కామెడీ డ్రామాగా ఐవీ శశి రూపొందిస్తున్న ఈ సినిమాను రాధికా ఎల్ నిర్మిస్తున్నారు. వసంత్ మురళీకృష్ణ మరింగంటి కథని అందించారు. జూలై 4 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా యాంకర్ సుమ చాట్ షోలో కీర్తిసురేశ్, సుహాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 28 రోజుల్లోనే ఉప్పు కప్పురంబు సినిమా షూటింగ్ పూర్తి చేసినట్లు కీర్తి సురేశ్ చెప్పింది.



# ప్రతి కథ ఫస్ట్ చెప్పింది చైతూకే: వెంకీ అట్లూరి



డేట్స్ లేకనో, ఇతరత్రా కారణాల వల్లో కొన్ని మంచి సినిమాలను హీరోలు కోల్పోతుంటారు. అలా చాలా సినిమాలను నాగచైతన్య కోల్పోయినట్లే కనిపిస్తోంది. దర్శకుడు వెంకీ అట్లూరి ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'నా అయిదు సినిమాల కథలు అందరికంటే ముందు నాగచైతన్యకే వినిపించా. కానీ డేట్లు ఇతరత్రా కారణాల వల్ల మా కాంబో మిస్సయ్యింది' అని చెప్పాడు. వెంకీ అట్లూరి తీసిని సినిమాల్లో వరుణ్ తేజ్ 'తొలిప్రేమ' హిట్టుగా నిలిచింది. అఖిల్ 'మిస్టర్ మజ్ను' మిస్ ఫైర్ అయ్యింది. నితిన్ 'రంగ్ దే' ఫర్వాలేదు. ధనుష్ 'సార్' ఊహించని స్థాయిలో ఘన విజయం అందుకుంది. దుల్కర్ సల్మాన్‌తో తీసిన 'లక్కీ భాస్కర్' బ్లాక్ బస్టర్. ఇలా 3 మంచి సినిమాలను చైతూ కోల్పోయినట్లే. వీటిల్లో ఏ రెండు చేసినా నాగచైతన్య కెరీర్ గాడినపడేది. ప్రస్తుతం వెంకీ అట్లూరి సూర్యతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా చేస్తున్నాడు. సితార బ్యానర్ మీద భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది.



# థియేటర్స్‌లోనే హరిహర వీరమల్లు ట్రైలర్ రిలీజ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన పీరియాడిక్ చిత్రం హరిహర వీరమల్లు కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. చాలా వాయిదాల తర్వాత జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. అయితే, సినిమా విడుదలకు ముందు ఆడియన్స్‌కు మంచి ఫీస్ట్ ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ట్రైలర్‌ను థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. జూలై 3న హరిహర వీరమల్లు ట్రైలర్ రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్స్‌లోనే విడుదల చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందించగా, మెగా సూర్య ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది.

# అజిత్ దోవల్ బయోపిక్?



ఇండియన్ జేమ్స్ బాండ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ రాబోతోందా? అంటే అవుననే ప్రచారం జరుగుతోంది. సలాకార్ పేరుతో సినిమా వస్తున్నట్లు సమాచారం. ఇందులో మౌనీరాయ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. జాతీయ భద్రత, రహస్యం, గూఢచర్యం అంశాలుగా ఈ సినిమా తెరకెక్కుతోందని, దీనికి ఫరూక్ కబీర్ దర్శకత్వం వహిస్తున్నారని తెలిసింది. ఆగస్టు 15న ఈ సినిమాను జియో హాట్ స్టార్‌లో ప్రసారం చేయనున్నారట. గూఢచారి సినిమా అయినా, అది అజిత్ దోవల్ జీవిత చరిత్రేనా? అన్న క్లారిటీ లేదు. ఇతర నటీనటుల పేర్లు కూడా తెలియరాలేదు.

# ఒక్కసారి వచ్చి కలువురా: లారెన్స్



విక్రమార్కుడు సినిమాలో లో బాలనటుడిగా మెప్పించిన రవి రాథోడ్ వచ్చి తనను కలవాలని రాఘవ లారెన్స్ కోరాడు. సినిమా అవకాశాల వేటలో అలసిపోయానని.. ప్రస్తుతం సెట్ వర్క్ చేస్తూ జీవితాన్ని గడుపుతున్నానని రవి రాథోడ్ చెప్పిన ఇంటర్వ్యూ చూసిన లారెన్స్.. 'ఆ వీడియో చూసి నా గుండె తరుక్కుపోయింది. మాస్ సినిమా షూటింగ్‌లో అతడిని కలిశాను. అప్పట్లో ఓ స్కూల్‌లో చేర్పించా. కాకపోతే ఏడాది తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడని తెలిసింది. మళ్లీ కలిసేందుకు ఎంతో ప్రయత్నించా. ఇన్నేళ్ల తర్వాత చూస్తుంటే భావోద్వేగంగా ఉంది. అలా, చెప్పకుండా వెళ్లిపోయినందుకు నేను కోప్పడతానేమోనని భయపడుతున్నట్లు ఇంటర్వ్యూలో చెప్పాడు. నిన్ను కొట్టను, తిట్టను. ఒక్కసారి చూడాలని మాత్రం ఉంది. దయచేసి నన్ను వచ్చి కలువు. నీ కోసం ఎదురుచూస్తుంటా' అని లారెన్స్ పేర్కొన్నారు. కాగా, రవి రాథోడ్ ఇచ్చిన ఇంటర్వ్యూలో.. 'కొన్నేళ్ల క్రితం నా తల్లిదండ్రులు మృతి చెందారు. స్నేహితులతో కలిసి ఉంటున్నా. రాఘవ లారెన్స్ నన్ను దత్తత తీసుకున్నాడు. ఓ స్కూల్‌లో చేర్పించాడు. అయితే ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయా. సెలవుల్లో హాస్టల్ నుంచి పారిపోయా. మళ్లీ అక్కడికి వెళ్లలేదు' అని పేర్కొన్నాడు.



# చరిత్ర సృష్టించిన మహారాజ్

## సౌతాఫ్రికా క్రికెట్‌లో నూతన చరిత్ర

సౌతాఫ్రికా తరపున టెస్టులో 200 వికెట్లు తీసిన తొలి స్పిన్నర్‌గా కేశవ్ మహారాజ్ చరిత్ర సృష్టించాడు. ఆ దేశం తరపున ఇప్పటి వరకు 200 టెస్ట్ వికెట్ల మార్కును ఏ స్పిన్నర్ కూడా అందుకోలేదు. ఇంతకుముందు 200కు పైగా టెస్ట్ వికెట్లు తీసిన సౌతాఫ్రికా బౌలర్లంతా ఫాస్ట్ బౌలర్లే కావడం గమనార్హం. జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో కేశవ్ ఈ ఘనత సాధించాడు. జింబాబ్వే కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ వికెట్ తీసి 200 వికెట్ మార్కు అందుకున్నాడు. కేశవ్ తర్వాత టెస్ట్‌ల్లో సౌతాఫ్రికా తరపున అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్లుగా టేఫీల్డ్ (170), పాల్ ఆడమ్స్ (134), పాల్ హ్యారిస్ (103), నికీ బోయే (100) ఉన్నారు. ఓవరాల్‌గా టెస్ట్‌ల్లో సౌతాఫ్రికా తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా డేల్ స్టెయిన్ (439) ఉన్నాడు. షాన్ పోలాక్ (421), ఎన్తిని (390), రబాడ (336), డొనాల్డ్ (330), మోర్కెల్ (309), కల్లిస్ (291), ఫిలాండర్ (224) 200 కంటే ఎక్కువ వికెట్లు తీసిన వారిలో ఉన్నారు. వీరంతా ఫాస్ట్ బౌలర్లే.

# సిక్సర్ బాది.. గుండెపోటుతో మృతి



చండీగఢ్: క్రికెట్ ఆడుతుండగా, జిమ్ చేస్తుండగా గుండెపోటుతో మృతి చెందుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తాజాగా.. క్రికెట్ ఆడుతూ పిచ్ మీదే కుప్పకూలిపోయాడో బ్యాటర్. వివరాల్లోకెళితే.. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ డీఏవీ స్కూల్ మైదానంలో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్న హర్జీత్ సింగ్.. సిక్సర్ కొట్టి అందరిలో జోష్ నింపాడు. పిచ్ మధ్యలోకి వచ్చిన హర్జీత్.. మోకాళ్లపై కూర్చొని అలాగే కూలబడ్డాడు. వెంటనే పరుగెత్తుకొచ్చిన స్నేహితులు సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేశారు. కానీ, అప్పటికే గుండెపోటుతో అక్కడే తుదిశ్వాస విడిచాడు. ఇదే నెలలో ఇలాంటి సంఘటన ముంబైలోనూ జరిగింది. క్రికెట్ ఆడుతూనే 42 ఏళ్ల రామ్ గణేశ్ తేవర్ అనే వ్యక్తి ప్రాణాలు విడిచాడు. అతడు కూడా సిక్సర్ బాదిన తర్వాత పిచ్ మీద కూలబడ్డాడు. అప్రమత్తమైన సహచరులు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే రామ్ గణేశ్ మరణించాడని వైద్యులు తెలిపారు.

# వెస్టిండీస్ హెడ్ కోచ్ మ్యాచ్ ఫీజులో కోత

వెస్టిండీస్ హెడ్‌కోచ్ డారెన్ సమీ మ్యాచ్ ఫీజులో ఐసీసీ కోత విధించింది. ఐసీసీ నియమావళిని అతిక్రమిస్తూ టీవీ అంపైర్ నిర్ణయాన్ని బహిరంగా తప్పుపట్టినందుకు అతడికి మ్యాచ్ ఫీజులో కోత విధిస్తున్నట్లు ప్రకటించింది. ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించింది. మ్యాచ్ అనంతరం సమీపై రిఫరీ ఐసీసీకి ఫిర్యాదు చేశాడు. దాంతో, విచారణ సమయంలో విండీస్ కోచ్ తన పొరపాటును అంగీకరించాడు. మ్యాచ్ అధికారిని బాహాటంగా విమర్శించినందుకు మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత పడింది. అసలేం జరిగిందంటే.. బార్బడోస్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన తొలిటెస్టులో ఐదుగురు విండీస్ బ్యాటర్లు వివాదాస్పదంగా ఔటయ్యారు. దాంతో, హెడ్‌కోచ్ సమీ టీవీ అంపైర్‌పై ఆగ్రహంతో ఊగిపోయాడు. కెప్టెన్ రోస్టన్ చేజ్ సైతం తమపై పగబట్టినట్టుగా.. టీవీ అంపైర్ తప్పుడు నిర్ణయాలు ప్రకటిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అలెక్స్ క్యారీ అందుకున్న బంతి నేలకు తాకినా సరే ఔటిచ్చాడు థర్డ్ అంపైర్ హోల్డ్‌స్టాక్. అంతేకాదు బంతి బ్యాట్‌కు తాకినట్టు స్పష్టంగా అల్ట్రా ఎడ్జ్‌తో తేలినా ఎల్బీగా ఔట్ ఇవ్వడంతో విండీస్ ఆటగాళ్లు అసహనం వ్యక్తం చేశారు.



# యష్ దయాల్‌పై లైంగిక వేధింపుల కేసు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ప్లేయర్ యష్ దయాల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఘజియాబాద్ ఇందిరాపురం పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ యువతి.. యూపీ సీఎం పోర్టల్‌లో దయాల్‌పై ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని ఆరోపించింది. దయాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఐదు సంవత్సరాలుగా తనతో సంబంధం ఉందని, పెళ్లి చేసుకుంటానని ప్రలోభపెట్టాడని, కాబోయే కోడలంటూ కుటుంబానికి చూపించాడని ఫిర్యాదులో తెలిపింది. ఇతర యువతులతో సంబంధాలున్నాయని తెలిసి ప్రశ్నించడంతో వేధింపులకు గురి చేశాడని ఆరోపించింది. దీనిపై ఈ నెల 14న మహిళా హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా, పోలీసులు చర్యలు తీసుకోలేదని వెల్లడించింది. సీఎం పోర్టల్‌లో ఫిర్యాదుతో యష్ దయాల్‌పై కేసు నమోదు చేసినట్లు డీసీపీ నిమిష్ పాటిల్ తెలిపారు. వాస్తవాల ఆధారంగా చర్యలుంటాయని పేర్కొన్నారు.





# బుమ్రాపై ఎక్కువగా ఆధారపడొద్దు: అజారుద్దీన్

భారత బౌలింగ్ ప్రధానాస్త్రం బుమ్రాపై ఎక్కువగా ఆధారపడొద్దని మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ వ్యాఖ్యానించారు. టీమిండియా బుమ్రాపై అతిగా ఆధారపడుతోందని, అలాకాకుండా బౌలర్లు సమిష్టిగా రాణించాలని సూచించారు. 'బుమ్రా ప్రతిసారి మెరుగైన ప్రదర్శన చేయలేడు కదా. ఇంగ్లండ్ పిచ్‌ల మీద అనుభవజ్ఞులైన బౌలర్లు ఉంటేనే వికెట్లు తీయగలం. అందుకే.. రెండో టెస్టులో కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలి. చైనామన్ బౌలర్ అయిన కుల్దీప్.. వైవిధ్యమైన బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించగలడు. ఈ మధ్య అతడు గొప్పగా రాణిస్తున్నాడు. బ్యాటింగ్‌లో లోయరార్డర్ వైఫల్యంతో తొలి టెస్టులో ఓటమి ఎదురైంది. రెండో టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తు చేయాలంటే పక్కాగా సిద్ధమవ్వాలి. వికెట్లు తీయగల బౌలర్లను తీసుకోవాలి. అప్పుడే సిరీస్ సమయం చేయగలుగుతాం. గిల్‌కు కెప్టెన్సీ ఇదే మొదటి సిరీస్. తొలి మ్యాచ్‌తోనే అతడి సారథ్యంపై అంచనాకు రాలేం. అతడికి కొంత సమయం ఇవ్వాలి. ఇప్పుడిప్పుడే విమర్శలు ఎక్కుపెట్టడం సరికాదు' అని అన్నారు. భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో టెస్టు సోమవారం ఎడ్జ్‌బాస్టన్‌లో ప్రారంభం కానుంది.

# వాణిజ్యవాణి

## టాటా స్టీల్‌కు రూ.1000 కోట్ల షోకాజ్ నోటీసులు

టాటా గ్రూప్‌నకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. మొన్నటికి మొన్న టాటా బ్రాండ్ అయిన ఎయిరిండియా విమానం భారీ ప్రమాదానికి గురికాగా, ఇప్పుడు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ అవకతవకలకు సంబంధించి టాటా స్టీల్ రూ.1000 కోట్ల విలువైన షోకాజ్ నోటీసులు అందుకుంది. 2018-19 నుంచి 2022-23 మధ్య ఆ కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా రూ.1,000 కోట్లకు పైగా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్(ఐటీసీ) పొందిన ఆరోపణలపై రూ.1,007 కోట్ల షోకాజ్ నోటీసులతో పాటు టాక్స్ డిమాండ్ నోటీసులను అందుకున్నట్టు ఆదివారం తన ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. నోటీసులు అందిన 30 రోజుల్లోగా కంపెనీ.. జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ సెంట్రల్ జీఎస్టీ, సెంట్రల్ ఎక్సైజ్ అదనపు/జాయింట్ కమిషనర్ ముందు హాజరు కావాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే రూ.541.19 కోట్ల జీఎస్టీ చెల్లించామని, జీఎస్టీ అధికారులు పేర్కొన్న దాంట్లో ఇంకా రూ.493.35 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని టాటా స్టీల్ వెల్లడించింది.



# 8 గంటల ముందే రైల్వే చార్ట్!

## రైల్వే బోర్డు కీలక ప్రతిపాదన

న్యూఢిల్లీ: తత్కాల్ టికెట్లకు ఆధార్ అథెంటికేషన్ అమలు చేయబోతున్న రైల్వే శాఖ.. మరో నిర్ణయానికి సిద్ధం అవుతోంది. టికెట్ రిజర్వేషన్ విధానంలోనూ కీలక మార్పులు తీసుకొచ్చేలా అడుగులు వేస్తోంది. రైలు బయలుదేరేందుకు 8 గంటల ముందే ప్రయాణికుల చార్టును సిద్ధం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల కంటే ముందు బయలుదేరే రైళ్లకు ముందురోజు రాత్రి 9 గంటలకే చార్టును ప్రిపేర్ చేయాలని తెలిపింది. ప్రస్తుతం ఈ సమయం 4 గంటలుగా ఉంది. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే వెయిటింగ్ లిస్టులో ఉండే వారికి ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. ఇక, 2025 డిసెంబర్ నాటికి అధునాతన ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్‌ను తీసుకొచ్చే దిశగా రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ఈ ప్రాజెక్టును సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ద్వారా అమలు చేయనుంది. దీంతో.. ఒక్క నిమిషంలోనే 1.5 లక్షలకుపైగా టికెట్ బుకింగ్‌లు చేసే సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం నిమిషాలకు 32 వేల టికెట్లు బుకింగ్ చేసుకునే సదుపాయం ఉంది. కొత్త వ్యవస్థతో బుకింగ్ సామర్థ్యం దాదాపు 5 రెట్లు పెరుగుతుంది.

# ఫ్రిజ్‌లు, వాషింగ్‌మెషీన్లకు పానాసోనిక్ గుడ్‌బై

జపాన్‌కు చెందిన ప్రముఖ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ పానాసోనిక్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్ల విభాగం నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ రెండు విభాగాల్లో పానాసోనిక్ నష్టాలను ఎదుర్కొంటోంది. మార్కెట్‌లో ఇతర కంపెనీల పోటీని తట్టుకోలేకపోతోంది. దీంతో.. ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్ల విభాగాల నుంచి తప్పుకుంది. మార్కెట్ గణాంకాల ప్రకారం.. పానాసోనిక్ వాషింగ్ మెషీన్లు 1.8 శాతం, ఫ్రిజ్‌లు 0.8 శాతం వాటాను మాత్రమే కలిగి ఉన్నాయి. అయితే, డీలర్ల వద్ద ఉన్న ఉపకరణాల అమ్మకాలకు సహకరిస్తామని, విడిభాగాలు, వారంటీ కవరేజీ, కస్టమర్ సేవలను అందిస్తామని స్పష్టం చేసింది.

# అమూల్ హవా

## నం.1 భారతీయ దిగ్గజ ఆహార బ్రాండ్

## బ్రాండ్ విలువ రూ.35 కోట్లకు పైనే



పాలు, పాల పదార్థాల ఉత్పత్తుల్లో అగ్రగామి అయిన అమూల్.. బ్రాండ్‌లో తగ్గేదేలే అంటోంది. గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్‌కు చెందిన ఈ బ్రాండ్.. భారతీయ ఫుడ్ బ్రాండ్ విభాగంలో నంబర్ వన్ స్థానాన్ని సాధించింది. బ్రాండ్ ఫైనాన్స్-2025 విడుదల చేసిన నివేదిక ప్రకారం.. అమూల్ బ్రాండ్ విలువ ఏకంగా రూ.35 వేల కోట్లకు పైగా. ఆ తర్వాతి స్థానంలో రూ.9,831 కోట్లతో ఢిల్లీకి చెందిన మదర్ డెయిరీ ఉంది. మూడో స్థానంలో బ్రిటానియా, నాలుగో స్థానంలో కర్ణాటకకు చెందిన పాల సహకార సంస్థ నందిని, ఐదో స్థానంలో డాబర్ ఉన్నాయి. మొత్తంగా చూస్తే భారత్ టాప్-100 బ్రాండ్లలో అమూల్ 17వ స్థానంలో, మదర్ డెయిరీ 35వ స్థానంలో ఉన్నాయి. అమూల్ మాతృసంస్థ అయిన జీసీఎంఎంఎఫ్ 36 లక్షల మంది రైతుల నుంచి ప్రతిరోజూ 3.2 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తోంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పాల సహకార సంస్థ. 50కి పైగా దేశాల్లో అమూల్ పాలు, పాల ఉత్పత్తులను అమ్ముతోంది.



ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 30-6-2025 | www.evarthalu.com



..........వివేక వాణి............

విజయం వరించిందని విర్రవీగకు. ఓటమి ఎదురైందని
నిరాశ చెందకు. విజయమే అంతం కాదు.
ఓటమి తుది మెట్టు కాదు.
- స్వామి వివేకానంద



## నేడు అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం

1908 జూన్ 30న రష్యాలోని సైబీరియా స్టోనీ తుంగుస్కా నది సమీపంలోని భూమిని అతిపెద్ద గ్రహశకలం ఢీకొట్టింది. దాని ప్రభావంతో దాదాపు 2,072 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం నాశనమైంది. దానికి గుర్తుగా జూన్ 30న అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవంగా జరుపుతున్నారు. ఐక్యరాజ్యసమితి తన తీర్మానంలో ప్రతి సంవత్సరం జూన్ 30 న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించింది.

గ్రహశకల దినోత్సవాన్ని ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్, చిత్రనిర్మాత గ్రిగోరిజ్ రిక్టర్స్, బీ 612 ఫౌండేషన్ ప్రెసిడెంట్ డానికా రెమీ, అపోలో 9 వ్యోమగామి రస్టీ ష్వీకార్ట్, క్వీన్ గిటారిస్ట్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త బ్రియాన్ మే కలిసి స్థాపించారు. రిచర్డ్ డాకిన్స్, బిల్ నై, పీటర్ గాబ్రియేల్, జిమ్ లోవెల్, అపోలో 11 వ్యోమగామి మైఖేల్ కాలిన్స్, అలెక్సీ లియోనోవ్, బిల్ అండర్స్, కిప్ థోర్న్, లార్డ్ మార్టిన్ రీస్, క్రిస్ హాడ్ఫీల్డ్, రస్టీ ష్వీకార్ట్, బ్రియాన్ కాక్స్ సహా 200 మంది వ్యోమగాములు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, కళాకారులు గ్రహశకల దినోత్సవ ప్రకటనకు సంతకాలు చేశారు. దీంతో 2014 డిసెంబర్ 3న ఈ అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం అధికారికంగా అమల్లోకి వచ్చింది.

2029లో భూమికి అతి దగ్గరగా..

99942 అనే అపోఫిస్ /గాడ్ ఆఫ్ ఖోస్ అనే అతిపెద్ద గ్రహశకలం 2029 ఏప్రిల్ 13న భూమికి అతి దగ్గరగా రానున్నది. దాదాపు 1,100 అడుగుల వెడల్పు ఉన్న అపోఫిస్ భూమిపైకి దూసుకువచ్చే అవకాశం ఉందని 2004లో ఖగోళ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఈ గ్రహశకలం మన గ్రహం మీదుగా సాధారణ ఉపగ్రహాలకు సమానమైన దూరంలో సురక్షితంగా పయనించనుంది. భూమి ఉపరితలం నుంచి 19,794 మైళ్ల దూరంలో ఈ గ్రహశకలం దూసుకెళ్లనుంది.

# మనుషులు చేసిన దేవుడు

**దేవుడు భూమిని సృష్టించాడు..**
**దేవుడు ప్రాణాన్ని సృష్టించాడు..**
**దేవుడు మనిషిని సృష్టించాడు..**
**మరి దేవుణ్ణి ఎవరు సృష్టించారు?**
**దేవుడి రూపాన్ని సృష్టించిందెవరు?**



దేవుడు భూమిని సృష్టించాడు.. భూమిపై మనిషినీ సృష్టించాడు. విశ్వాసాన్ని సృష్టించాడు.. దేవుడు చేసిన మనుషులు అదే దేవుణ్ణి తయారు చేశారు.. అతడికి గుడి కట్టారు.. గోపురాన్ని కట్టారు.. విగ్రహాన్నీ తయారు చేశారు.. ఈ రూపానికి ఆధారం ఏమిటి? మనిషి దీన్ని ఎలా తయారు చేశాడు? దీనికి ప్రాణం పోయటం సాధ్యమేనా? దీన్ని పూజిస్తే భగవంతుడు ప్రసన్నమవుతాడా? మానవుడి విశ్వాసంలోంచి ఆవిర్భవించిన అపూర్వ సృష్టి.. మనిషి జీవితాన్ని శాసించిన సృష్టి.. మనిషి చేసిన దేవుడు. దేవుడికి పుట్టుక లేదు.. చావు లేదు.. రూపం లేదు.. వేషం లేదు.. ఆయన సర్వాంతర్యామి అన్నది అన్ని మతాల విశ్వాసం.. ఆయన్ను చూసిన వారెవరో తెలియదు. మనిషికి కనిపించని ఒక మహాశక్తి.. అలాంటి శక్తికి.. అలాంటి సృష్టికి, అలాంటి తేజస్సుకు.. అలాంటి సర్వాంతర్యామికి మనిషి ఒక రూపాన్నిచ్చాడు.. వేషమిచ్చాడు.. అభరణాలను ఇచ్చాడు.. తనకంటే ఎక్కువ రాజపూజ్యాలను ఇచ్చాడు.. తను చేసిన దేవుడిని తానే ఊరేగిస్తున్నాడు. ఒక ప్రత్యేక వాతావరణం.. మనసుకు ఒక్కసారిగా ప్రశాంతతను చేకూర్చే వాతావరణం.. విషపూరితమైన వాతావరణంనుంచి ఒక్కసారిగా బయటపడినంత ఫీలింగ్.. ఆ పరిసరమే ఒక కొత్త ప్రపంచం.. భక్తి ప్రపంచం.. భగవంతుడి ప్రపంచం.. దేవాలయం.. అక్కడ రణగొణ ధ్వనులున్నా.. అవి వాతావరణాన్ని కలుషితం చేయవు. నినాదాలు మిన్నంటినా... మనసులో ప్రశాంతత చెక్కు చెదరదు.. దైవాన్ని ఊరేగిస్తుంటే.. నాట్యాలు చేసినా.. వేలాది జనం నీరాజనాలు పలుకుతున్నా.. వాతావరణంలోకి కాలుష్యం చేరదు. ఏ దేవాలయానికి వెళ్లినా అక్కడ ఉండే ప్రత్యేకతే అది. అసలు ఆలయానికి వెళ్లడంలోని ఆంతర్యమే అది. చికాకులనుంచి, చీకూచింతల నుంచి కాసేపైనా రిలాక్స్ కావటం కోసమే ఆలయానికి వెళ్లేది. దేవుడు మనిషిని సృష్టిస్తే.. మనిషి దేవుడి కోసం చేసిన ప్రత్యేక సృష్టి ఆలయం. విశాలమైన ప్రాంగణంలో ప్రశాంతమైన సంకీర్తనలతో.. నిత్యోత్సవ, పక్షోత్సవ, సంవత్సరోత్సవాలతో భగవంతుడికి సేవచేసే అద్భుతమైన ప్రదేశం.. ఆలయం. ఉత్సవాలనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది శ్రీవారి ఆలయం తిరుమల. అక్కడ స్వర్ణకాంతులీనే దేవదేవుడికి ప్రతిరోజూ జరిగే ఉత్సవాలను చూడటానికి రెండు కళ్లు ఎందుకూ సరిపోవు. రకరకాల వాహనాల్లో, పల్లకిలో, రథంలో కూచుని ఊరేగుతున్న శ్రీనివాసుడి దివ్యమంగళ విగ్రహాన్ని చూసేందుకే రోజుకు దాదాపు లక్ష మంది రావటమే ఒక అద్భుతం. ఏమిటా విగ్రహంలోని గొప్పతనం? అంతమందిని ఆకర్షిస్తున్న అనంతమైన సౌందర్యం ఆ విగ్రహంలోకి ఎలా వచ్చింది? మూల విరాట్టు రూపం సంగతి సరే సరి.. ఉత్సవాల్లో సకల భోగాలతో దర్శనమిస్తున్న స్వామివారి విగ్రహాలకు అంతటి తేజస్సు ఎక్కడిది? అసలు ఆ విగ్రహాలను ఎలా తయారు చేస్తారు? ఎక్కడి నుంచి అంత శోభ వాటికి లభిస్తుంది... నిజంగా దేవుడు ఆ విగ్రహాల్లో కొలువై ఉంటాడా?

పరమేశ్వరుని సాకారంగా దర్శించిన వాళ్లు ఎవరైనా ఉన్నారో లేదో మనకైతే తెలియదు.. దేవుణ్ణి ఫలానా వారు చూశారంటూ తపస్సంపన్నుల గురించి, ఉపాసనాపరుల గురించి చెప్పగా విన్నాం.. వారి దగ్గరకు వెళ్లి నమస్కారం చేస్తాం.. కానీ, మనకు తెలిసిన దేవుడు ఆలయంలో విగ్రహమే. మూల విరాట్టు ప్రధానమూర్తి అయితే, ఉత్సవ విగ్రహం సేవా మూర్తి. ఈ ఇద్దరినే మనం దేవీదేవుళ్లుగా పూజిస్తాం. భక్తి ప్రపత్తులతో నమస్కరిస్తాం.. కోరికలు తీర్చమని కోరుకుంటాం.. ఈ విగ్రహాలు ఎలా రూపొందాయి? వీటి తయారీ వెనుక నేపథ్యం ఎంతో ఉంది. ఆ మూర్తిని చూస్తేనే ఒంట్లో ఒకరకమైన పులకింత కలుగుతుంది. మనసు భక్తిభావంతో పరవశించిపోతుంది. ఆ రూపంలోనే ఒకరకమైన దివ్య తేజస్సు కనిపిస్తుంది. ఆ తేజస్సులోనే భక్తులకు స్వామి సాక్షాత్కరిస్తాడు. కోరిన కోర్కెలన్నింటినీ తీరుస్తాడు. ఇంత గొప్ప రూపం భగవంతుడికి ఇచ్చింది ఎవరు? భగవంతుడికి రూపం ఏమిటో ఎవరికీ తెలియదు.. కానీ, రూపాన్నిచ్చింది మాత్రం మనిషే.. అంత సౌందర్యమూర్తిని సృష్టించింది మనిషే.. దేవదేవుడి దివ్యమంగళ విగ్రహం మూలవిరాట్టులోనే ఉంటుంది. సాధారణంగా స్వయంభువుగా భగవంతుడు అవతరించిన ప్రాంతాల్లో కాకుండా.. మిగతా ఆలయాల్లో మూల విగ్రహాన్ని రూపొందించేందుకు నల్లని గండశిలను ఉపయోగిస్తారు.. ఇప్పుడంటే పాలరాయి, నల్లని గ్రానైట్ రాతిని విగ్రహ రూపకల్పనకు వినియోగిస్తున్నారు. నల్లని గండశిలతో ప్రధాన విగ్రహ రూపకల్పన జరుగుతుంది. దీనిపై విద్యుత్తు దీపాలను వెలగనివ్వరు.. ఈ విగ్రహాలు ఆభరణాల అలంకరణల్లోనే దివ్యకాంతులీనుతాయి. నూనె దీపాలతో విగ్రహాలకు జ్యోతలు పడతారు. పాలరాయి, గ్రానైట్లతో రూపొందించిన విగ్రహాలను ప్రతిష్ఠించిన చోటనే విద్యుద్దీపాలు ఉంచుతున్నారు. గండశిలతో రూపొందించిన మూల విగ్రహాలపై విద్యుత్తు కాంతులను వెదజల్లితే విగ్రహాల్లోని స్వచ్ఛమైన దివ్య తేజస్సు దర్శనం కాదని విశ్వాసం.

తంజావూరు ఇందుకు ప్రబలమైన ఉదాహరణ. తంజావూరులోని బృహదీశ్వరుని మూల శివలింగం అపూర్వమైంది. రాజరాజచోళుడు నిర్మించిన ఈ ఆలయం దేశంలోనే గొప్పనిర్మాణ వైచిత్రి కలిగింది. అతి పెద్ద ఆలయమూర్తులలో ఒకరుగా ఇక్కడి బృహదీ శ్వరుడు దర్శనమిస్తారు.. ఇందులోని మహాదేవుడి శివలింగం ఈ విధంగా రూపొందిందే.. నలుగురు మనుషుల ఎత్తుండే ఈ మహాలింగాన్ని చూసేందుకు ఎన్ని కన్నులున్నా సరిపోవు. మూల విగ్రహం ప్రాణప్రతిష్ఠ జరిగిన తరువాత ఎక్కడికీ కదిలించరు. దేవీదేవతలకు సంబంధించి ఎలాంటి చలనపూరితమైన ఉత్సవాలు జరగాలన్నా ఉత్సవమూర్తులే ఆధారం. ఈ ఉత్సవమూర్తులు మనిషి శరీరం లాంటివి. మన శరీరం పంచభూతాలతో ఎలా తయారవుతుందో, ఈ విగ్రహాలు కూడా పంచ లోహాలతో తయారవుతాయి. భూమి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశాలు మన శరీరాన్ని పుట్టుక నుంచి చనిపోయేంత వరకు ప్రభావితం చేస్తాయి. దేవాలయాల్లో ఉత్సవమూర్తులను పంచ లోహాలతో తయారు చేస్తారు. దీనికి ప్రత్యేకమైన శిల్ప నైపుణ్యం అవసరమవుతుంది.. ఎక్కడా ఎలాంటి లోపం లేకుండా, స్వామిని రూపకల్పన చేయటం నిజంగా ఈశ్వరుడిచ్చిన వరమే. పంచలోహ విగ్రహం.. ఈ పదం మనం తరచూ వినే మాటే.. ఏ ఆలయంలోనైనా, ఎక్కడైనా, దేవతామూర్తుల విగ్రహం అంటే పంచలోహ విగ్రహమే. ఈ విగ్రహం తయారు చేయాలంటే మామూలు విషయం కాదు. జీవకళ ఉట్టిపడేలా దేవతామూర్తిని సృష్టించడానికి ప్రత్యేక నైపుణ్యం ఉంటుంది. బాగా చేయి తిరిగిన వాళ్లు నిష్ఠగా పూనుకుంటేనే అది సాధ్యపడుతుంది. సాకారమవుతుంది. పంచలోహ మూర్తి.. తయారు కావటానికి ముందు పెద్ద తతంగమే ఉంటుంది. దేవతలను మూర్తిమంతం చేయటంలో తమిళనాడు కళాకారులను మించిన వాళ్లు ఉండరు. దేవతా విగ్రహాన్ని తయారు చేయటానికి, ముందుగా ఆ స్వామిని కళాకారులు ఉపాసిస్తారు.. ఆయన మూర్తిని పూర్తిగా మనసులో నిలుపుకుంటారు. ఆ తరువాతే విగ్రహాన్ని రూపొందించటం ప్రారంభిస్తారు.

ముందుగా మైనం ముద్దను తీసుకుని దానితో తాము చేయాల్సిన విగ్రహం అచ్చును తయారు చేస్తారు.. వస్త్రభూషణాలతో సహా అన్నింటినీ ఈ అచ్చులో వచ్చేట్లు జాగ్రత్త పడతారు.. మైనం విగ్రహమే చాలా కీలకం.. ఇందులో ఎలాంటి లోపం రాకుండా చూసుకోవటం పెద్ద సమస్య. ఏ చిన్న పొరపాటు జరిగినా చివరగా వచ్చే విగ్రహంపై ఆ లోపం స్పష్టంగా కనిపిస్తుంది.. నిత్యం ఆరాధన జరిగే విగ్రహాల్లో ఎలాంటి లోపం రాకుండా చూసుకోవటంలో చాలా జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. భారతీయ శిల్పశాస్త్రం విగ్రహాలను తయారు చేయటంలో ప్రత్యేకంగా విధించిన నిబంధనలను వీళ్లు తు.చ. తప్పకుండా పాటిస్తారు. మైనాన్ని ఎక్కడ ఎలా ఫోల్డ్ చేయాలో ప్రణాళికాబద్ధంగా ఉంటుంది. మైనాన్ని అనుకున్న విధంగా ఫోల్డ్ చేసుకున్న తరువాత దానితో అసలైన విగ్రహం తయారవుతుంది. ఆ మైనపు అచ్చును చుట్టూ పిడకలు పేర్చి వేడి చేయటం ద్వారా అచ్చులో కరిగిస్తారు. ఇది పార్థనతో మొదలు అవుతుంది.. ప్రార్థనతోనే ముగుస్తుంది. ఇది మొత్తం కరగటానికి దాదాపు రెండు గంటలు పడుతుంది. అలా కరిగిన తరువాత దానిపై వేడి చేసిన పంచలోహ మిశ్రమాన్ని నెమ్మదిగా పోస్తారు. అది పూర్తిగా చల్లారిన తరువాత చుట్టూ పేరుకుపోయిన మట్టిని తొలగించి అసలైన విగ్రహాన్ని బయటకు తీసి, దానికి తుది మెరుగులు దిద్దుతారు. తరువాత మిగిలేది ఆ మూర్తిలో మంత్రోచ్చారణలతో ప్రాణ ప్రతిష్ఠ చేయటం అర్చనాది సేవలను కొనసాగించటం.. ఎంత కష్టపడి.. భక్తి ప్రపత్తులతో.. శిల్పశాస్త్ర నిబంధనలకు లోబడి ఖచ్చితమైన పద్ధతులతో చేయటం వల్లనే శిల్పం విగ్రహం అవుతుంది. విగ్రహం దేవుడిగా మారుతుంది.. ప్రాణం పోసుకుంటుంది. దివ్య తేజస్సు సంతరించుకుంటుంది.. దైవం ఆ విగ్రహాన్ని తన నెలవు చేసుకుంటుంది. మనిషి కోరిన కోరికలన్నింటినీ తీరుస్తోంది. మనిషి అందించిన సేవలన్నింటినీ అందుకుంటోంది.

ఇంతకీ పంచలోహాలు ఏమిటి? ముందే చెప్పుకున్నట్లు మనకు పంచభూతాలు ఎలాగో, పంచలోహాలు అలాంటివే. కంచు, రాగి, బంగారం, వెండి, ఇనుము ఇవన్నీ పంచలోహాలు. దేవతామూర్తుల రూపకల్పనలో ఈ లోహాలను ఏయే పాళ్లలో కలపాలో శిల్పశాస్త్రం స్పష్టంగా చెప్పంది. ఈ పద్ధతి ప్రకారం వెండి నాలుగు పాళ్లు.. బంగారం ఒక పాలు.. కంచు ఎనిమిది పాళ్లు.. రాగి ఎనిమిది పాళ్లు.. ఇనుము కొద్దిగా. రాగి, కంచు ప్రధానంగా మిగతా లోహాలు మిగతా పాళ్లలో కలిపి కరిగించి దైవ స్వరూపాన్ని రూపొందిస్తారు. హిందూ దేవతా మూర్తుల్లో ఈ నిష్పత్తిని ఖచ్చితంగా పాటిస్తారు. మిగతా మతాల్లో విగ్రహాలను తయారు చేయటంలో ఈ నిష్పత్తిలో కొంత తేడా ఉండవచ్చు. కొన్ని విగ్రహాల్లో సీసం కూడా ఉపయోగిస్తారు. ఇలా రూపొందించిన విగ్రహాలు ఒకసారి ప్రాణపతిష్ఠ జరిగిన తరువాత వెయ్యేళ్ల వరకూ చెక్కుచెదరవు. మనిషి జీవిత కాలం 60 నుంచి 70 ఏళ్లు ఉంటే.. విగ్రహాల జీవితకాలానికి ఎండ్ అన్నదే ఉండదు. ఈ విగ్రహాలు ఎన్నాళ్లయినా తేజస్సు కోల్పోకుండా చైతన్యవంతంగా ఎలా ఉంటాయో మీకు తెలుసా? స్వామి వారికి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయటం వల్లనే ఈ చైతన్యం నిరంతరంగా ఉంటుంది. ఈ పూజలు, పునస్కారాలు చేయటం వల్లనే భగవంతుడు విగ్రహాల్లో కొలువై ఉండటం వల్లనే ఈ తేజస్సు ఉంటుంది. ఏమిటీ సేవలు? ఏమిటీ పూజలు? అన్ని దేవాలయాల్లో మూల విగ్రహాలకు అభిషేకాదులు చేస్తే.. ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవ చేస్తారు. తిరుమంజనం అంటే ఉత్సవ మూర్తులను శుద్ధి చేసే కార్యక్రమం. స్నానపానాదులతో పాటు.. పంచామృతాలు.. చందనాదులు.. ఇతర ప్రత్యేక పదార్థాలతో విగ్రహాలకు అభిషేకం చేసి కొత్త వస్త్రాలు ధరింపజేస్తారు. దేవతామూర్తుల తిరుమంజన సేవ ఒక విశిష్టమైన ప్రక్రియ. మళ్లీ అదే మాట.. దేవుడు ఎలా ఉంటాడో మనకైతే తెలియదు. మనకు ఇష్టమైన దేవతను మనకు ఇష్టమైన రూపంలో కొలుచుకుంటాం.. ఆ దేవత మూర్తిమంతం కావటం వెనుక ఎంత తతంగం ఉందో తెలుసుకున్నారు కదా.. భక్తి ప్రపత్తులతో, నిష్ఠతో తయారు చేసిన విగ్రహం ఆ తరువాత విగ్రహంగా ఉండదు.. దైవంగా మారిపోతుంది. దైవం విగ్రహరూపంలో ఆలయాన్ని తన నెలవుగా మలచుకుంది. అందుకే దానికి అంత సౌందర్యం.. దాన్ని చూస్తేనే అలౌకిక ఆనందం.. అంతులేని ప్రశాంతత.



**కోవెల సంతోష్ కుమార్**
ప్రముఖ రచయిత

# పూరిలో రథ చక్రాల్లా స్వయం సేవకులు

పండుగైనా, ప్రమాదమైనా.. సేవలు అందించేందుకు ముందు వరుసలో ఉండేది.. స్వయం సేవకులు. నిస్వార్థంగా సేవలు అందిస్తూ, తమ నిబద్ధతను చాటుకోవడంలో స్వయం సేవకులు ముందుంటారు. తాజాగా పూరిలోనూ స్వయం సేవకులు తమ నిబద్ధతను తెలియజేశారు. పూరి రథయాత్ర సందర్భంగా దాదాపు 1,560 మందికి పైగా స్వయంసేవకులు అంకిత భావంతో సేవలందించారు. భక్తులకు అవసరమైన సేవలు అందిస్తూ.. ప్రజల నుంచి ప్రశంసలను అందుకుంటున్నారు. జన సమూహం ఉన్నా, తొందరపడకుండా, జాగ్రత్తగా, క్రమశిక్షణతో సేవలు అందించారు.

వైద్య సహాయం మొదలు.. భక్తులకు ఏ అవసరం వచ్చినా, తక్షణమే స్పందించారు. అంబులెన్సుల కోసం కారిడార్ నిర్మాణం, అంబులెన్స్ సహాయం, స్ట్రెచర్ల సహాయం, ట్రాఫిక్ నియంత్రణ, నీటి వ్యవస్థ, ఆస్పత్రిలో సౌకర్యాలు, శుచి, శుభ్రత, ప్రాథమిక వైద్య సహాయం తదితర విషయాల్లో స్వయం సేవకులు విస్తృత సేవలు అందించారు. రథ యాత్ర ప్రారంభమైన రోజు ఉదయం 8:30 గంటలకే వీళ్లు తమ సేవలను ప్రారంభించారు. భోలానాథ్ స్కూల్ సమీపంలోని ఉత్కల్ బిపన్న సహాయత సమితి ప్రాథమిక కేంద్ర వద్ద ఈ సేవలను ప్రారంభించారు. రద్దీ అధికంగా వుండటం, విపరీతమైన వేడి వల్ల భక్తులు తరుచూ మూర్ఛపోవడం లేదా గాయపడటం వంటి సంఘటనలు జరిగాయి. ఇలాంటి సందర్భాల్లో ఆరెస్సెస్ స్వయంసేవకులు వెంటనే స్పందించి, వారికి ప్రాథమిక చికిత్స చేసి, అంబులెన్సుల్లో ఆస్పత్రికి తరలించే బాధ్యతలను భుజాలకెత్తుకున్నారు. రథయాత్రకు విపరీతంగా భక్తులు రావడంతో.. రోగులను తరలించడానికి ఇబ్బందులు కలుగుతాయని ముందే గ్రహించిన స్వయంసేవకులు.. అత్యవసర కారిడార్‌ను ఏర్పర్చడంతో పాటు, మానవ గొలుసులుగా ఏర్పడి, రోగులు సమయానికి ఆస్పత్రికి చేరేలా ప్రయత్నాలు చేశారు. వైద్యులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ తగిన వైద్య చికిత్స అందేలా చేశారు. దీని కోసం వారంతా బృందాలుగా విడిపోయి, షిఫ్టుల వారీగా సేవలందించారు. వైద్య కేంద్రాలలో 200 మంది చొప్పున స్వయంసేవకులు ఉన్నారు. మరో 200 మంది బడాదండాను శుభ్రం చేయడంలో నిమగ్నమయ్యారు. వైద్యులు, ఫార్మసిస్టులకు కూడా సహాయకులుగా ఉంటూ సాయం అందించారు. మరో 100 మంది స్వయంసేవకులు ట్రాఫిక్ నియంత్రణ కోసం, మరో 884 మంది స్వయంసేవకులు అంబులెన్స్ కారిడార్ కోసం, ఇతర సేవల్లో పాల్గొన్నారు.



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.